RNI No : TELTEL/2022/85167

# పద్మక్రాంతి

( వాస్తవాలు వెలుగులోకి )

తెలుగు దినపత్రిక

సంపుటి : 03 సంచిక : 222 రంగారెడ్డి ఎడిటర్ : గంజి వెంకటేశ్ ఆదివారం, ఆగష్టు 03, 2025 పేజీలు : 8 వెల: 3 రూ

Volume: 03 Issue :222 Rangareddy Editor: Ganji Venkatesh Sunday, August 03, 2025 Pages:8 Price: 3/-

## శ్రీవారిని దర్శించుకున్న కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ



**తిరుమల,ఆగస్ట్2(పద్మక్రాంతి):**

కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. శుక్రవారం రాత్రి తిరుమలకు చేరుకున్న ఆయన గాయత్రి నిలయంలో బస చేశారు. ఉదయం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో కుటుంబ సమేతంగా స్వామివారి సేవలో పాల్గొన్నారు. తితిదే అదనపు ఈవో వెంకయ్య చౌదరి కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి స్వాగతం పలికి దర్శనం ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయంలోకి వెళ్లి, స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వచనం చేసి మంత్రికి తీర్థప్రసాదాలు అందజేశారు. టిటిడి బోర్డు సభ్యుడు భాను ప్రకాశ్ రెడ్డి దగ్గరుండి దర్శనం చేయించారు.





ఇతర దేశాలపై ఆధారపడకుండా సాగాలి

ట్రంప్ టారిఫ్‌ల నేపథ్యంలో సంచలన వ్యాఖ్యలు

## మోడీ స్వదేశీ వస్తు నినాదం

**వారణాసి,ఆగస్ట్2(పద్మక్రాంతి):**

భారత్ కూడా అతి త్వరలోనే మూడో అతిపెద్ద ఆర్థిక శక్తిగా మారనుందని ప్రధాని మోడీ మరోమారు ఉద్ఘాటించారు. అందువల్ల ఇప్పుడు మన ఆర్థిక ప్రయోజనాలపై మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగే దిశగా భారత్ పరుగులు పెడుతోందని మోదీ తెలిపారు. అంతేకాదు.. ట్రంప్ టారిఫ్‌ల వేళ స్వదేశీ ఉత్పత్తులను పెంచాలంటూ పిలుపునిచ్చారు. భారత్ ఆర్థిక వ్యవస్థను ఉద్దేశిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. 'డెడ్ ఎకానమీ' అంటూ ఆయన

మిగతా 3 లో



## దళితులు, ఆదివాసీల సంక్షేమం కోసం కృషి

- సామాజిక న్యాయం కాంగ్రెస్‌కే సాధ్యం
- దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన పార్టీ కాంగ్రెస్
- పదవులను త్యాగం చేసిన ఘనత సోనియాది
- రాహుల్‌ను ప్రధానిని చేస్తామని తెలంగాణ పక్షాన హామీ
- 75 ఏళ్ల నిబంధన పెట్టినా పదవి వదలని నేత మోడీ
- మోడీని గద్దెదించడం కేవలం రాహుల్‌కు మాత్రమే సాధ్యం
- కాంగ్రెస్ న్యాయ సదస్సులో సిఎం రేవంత్ రెడ్డి

3 లో



## ప్రపంచంతో పోటీ పడాలనే స్పోర్ట్స్ పాలసీ

- క్రీడల్లో తెలంగాణ యువత రాణించాలి
- చదువుతో పాటు ఆటల్లోనూ మేటి కావాలి
- యువత పెడదోవపట్టకుండా క్రీడల్లో ప్రోత్సాహం
- తెలంగాణ స్పోర్ట్స్ పాలసీ'ని ఆవిష్కరించిన సీఎం రేవంత్‌రెడ్డి





**హైదరాబాద్,ఆగస్ట్2(పద్మక్రాంతి):**

ప్రపంచంతో పోటీ పడాలనే స్పోర్ట్స్ పాలసీని తీసుకువస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. చదువుల్లోనే కాదు.. క్రీడల్లోనూ యువత రాణించాల్సిన అవసరం ఉందన్నారు. క్రీడా విధానం లేకపోవడం వల్ల పట్టణ ప్రాంతాల్లోని యువత పెడదోవ పడుతు న్నారని, క్రీడలను ప్రోత్సహించకపోవడం వల్లే యువత డ్రగ్స్ తీసుకుంటున్నారని సీఎం పేర్కొన్నారు. శనివారం హెచ్ఐసీసీలో జరిగిన తెలంగాణ స్పోర్ట్స్ కాంక్లేవ్‌లో 'తెలంగాణ స్పోర్ట్స్ పాలసీ'ని సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. దేశంలో నూతన విధానాన్ని ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ప్రపంచంతో పోటీపడే మనం.. క్రీడల్లో వెనకబడి ఉండడం బాగాలేదన్నారు. భారత్‌కు బలమైన క్రీడా వేదిక కావాలని.. అందులో తెలంగాణ ప్రధానంగా ఉండాలని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

ఫస్ట్ ఎడిషన్ ఆఫ్ తెలంగాణ స్పోర్ట్స్ కాంక్లేవ్ సభలో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు సీఎం రేవంత్. డ్రగ్స్ పై ఉక్కుపాదం మోపుతున్నామని.. యువతకు దశ దిశా లేకపోవడం బాధాకరమని అన్నారు. వ్యసనాల రూపంలో మనవైపు వేగంగా ప్రమాదం దూసుకొస్తుందని అన్నారు. ఓ విధానం లేకపోవడం వల్లే సమస్యలు వస్తున్నాయని.. అందుకే నూతన క్రీడావిధానాన్ని తీసుకొస్తున్నామని అన్నారు. క్రీడల్లో రాజకీయ జోక్యం ఉండకూడదని భావిస్తున్నామని అన్నారు.

తెలంగాణ రైజింగ్ 2047 పై స్పోర్ట్స్ చాప్టర్

మిగతా 3 లో





## కాళేశ్వరం కేసులో కెసిఆర్ పక్కా దోషి

- కమిషన్ విచారణలో అదే తేలింది
- సొంత లాభం కోసం లక్షకోట్లు వృధా చేసిన కెసిఆర్
- అందుకు మూల్యం చెల్లించక తప్పదు: పిసిసి చీఫ్

**సంగారెడ్డి,ఆగస్ట్2(పద్మక్రాంతి):**

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ షాకింగ్ కామెంట్స్ చేశారు. కేసీఆర్ దోషి అని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ చెప్పిందని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో లక్షల కోట్ల రూపాయలు వృధా చేసి తెలంగాణను కేసీఆర్ అప్పులపాలు చేశారని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ తేల్చి చెప్పిందని అన్నారు. ఇంజనీర్లు చెప్పింది కేసీఆర్ వినకుండా తన సొంత లాభం మాత్రమే చూసుకున్నారని విమర్శించారు. పాదయాత్రలో భాగంగా శనివారం ఆందోలు మండలం సంగుపేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి దామోదర రాజనర్సింహ, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడారు. తనకి ఇష్టం ఉన్న చోట కాళేశ్వరం ప్రాజెక్టు కట్టాలని కేసీఆర్ ఆదేశాలు ఇచ్చారని చెప్పుకొచ్చారు. రెండే పిల్లర్లు కుంగాయని బీఆర్ఎస్ నేతలు అంటున్నారని...ఇది సామాన్య విషయమా..? అని ప్రశ్నించారు. ఫార్ములా ఈ కారు రేస్‌లో మాజీ మంత్రి కేటీఆర్ అవినీతికి పాల్పడలేదా..? అని నిలదీశారు. ప్రభుత్వ సొమ్ము తిన్న వాళ్లు కక్కక తప్పదని మహేష్ కుమార్ గౌడ్

మిగతా 3 లో

## బిసి రిజర్వేషన్ల పేరుతో కాంగ్రెస్ డ్రామాలు



- 42శాతం రిజర్వేషన్లు అమలు చేసి చూపాలి
- కామారెడ్డి డిక్లరేషన్‌కు ఎందుకు కట్టుబడలేదు
- ముస్లిం రిజర్వేషన్లతో బిసిల కోటాకు గండి
- కేంద్రం, బిజెపిలపై నెపం నెట్టి తప్పించుకునే యత్నం
- ఎంతమంది బిసిలకు పదవులు కట్టబెట్టారో చెప్పాలి
- ఇందిరాపార్క్ వద్ద సభలో బిజెపి నేతల డిమాండ్

హైదరాబాద్,ఆగస్ట్2(పద్మక్రాంతి): రిజర్వేషన్‌లు అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం, బీజేపీపై బట్టకాల్చి మీద వేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తున్నదని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఇది బీసీ రిజర్వేషన్ల కోసం కాదని.. ముస్లింలకు మేలు చేసేదని విమర్శించారు. గతంలో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన రాష్ట్రం తెలంగాణ అని ఉద్ఘాటించారు. ఇందిరాపార్క్ వద్ద జరిగిన ధర్నాలో కాంగ్రెస్ ప్రభుత్వం, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో వందరోజుల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లను అమలు చేస్తామని చెప్పిందని.. కానీ ప్రభుత్వం ఏర్పాటై రెండు సంవత్సరాలు అవుతున్న ఇంకా ఎందుకు ఆలస్యం చేస్తున్నారని ప్రశ్నించారు.



ఎంఐఎం చేతిలో కీలుబొమ్మగా ఉన్న కేసీఆర్ ముస్లింలకు 12శాతం రిజర్వేషన్‌లు అమలు చేస్తామని అసెంబ్లీలో ప్రకటించారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

మిగతా 3 లో





## పుష్కలంగా నీరున్నా.. నిర్వహణ లేదు

- అందుకే రాష్ట్రాలమధ్య జల వివాదాలు
- ఏటా వృథాగా పోతున్న వేల టీఎంసీల గోదావరి నీరు
- షిప్పింగ్, పోర్టులు, రోడ్లతోనే దేశం వేగంగా అభివృద్ధి
- రూ.5,233 కోట్ల రహదారులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- మంగళగిరి వేదికగా పలు కార్యక్రమాలకు గడ్కరీ శ్రీకారం

3 లో



## పార్లమెంట్ సాక్షిగా యూరియాపై తప్పుడు లెక్కలు

- ఖరీఫ్ కేటాయింపులు 9.80 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే
- ఇప్పటికే 2.24 లక్షల మెట్రిక్ టన్నుల లోటు
- కేంద్రమంత్రి అనుప్రియా పటేల్‌కు మంత్రి తుమ్మల లేఖ

**హైదరాబాద్,ఆగస్ట్2(పద్మక్రాంతి):**

పార్లమెంట్ సాక్షిగా యూరియా సరఫరాపై తప్పుడు లెక్కలు చెప్పడం శోచనీయమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుగారు అన్నారు. రాష్ట్రానికి 9.80 లక్షల మెట్రిక్ టన్నులు కేటాయించి,

3 లో





## యువతను క్రీడల వైపు మళ్ళిస్తున్నాం

- అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దేయత్నం
- మంత్రి వాకిటి శ్రీహరి వెల్లడి

**హైదరాబాద్,ఆగస్ట్2(పద్మక్రాంతి):**

యువతను క్రీడల వైపు మళ్ళిస్తూ ,అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చి దిద్దుటకు తెలంగాణ క్రీడల పాలసీని తీసుకురావడం జరిగిందని రాష్ట్ర క్రీడల యువజన సర్వీసుల పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. శనివారం హెచ్ఐసీసీలో ఫస్ట్ ఎడిషన్ తెలంగాణ స్పోర్ట్స్ కన్‌క్లేవ్ కార్యక్రమంలో రాష్ట్ర క్రీడలు యువజన సర్వీసులు పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలోనే కొత్తగా స్పోర్ట్స్ పాలసీని అమలు చేస్తూ అన్ని క్రీడలకు సముచిత స్థానం కల్పిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకువచ్చిన ఈ

మిగతా 3 లో

## అన్నదాత సుఖీభవ ద్వారా 46,85,838 మంది రైతులకు లబ్ధి

- దీనికోసం రూ.2,343 కోట్ల నిధుల్ని కేటాయించాం
- అన్నదాత సుఖీభవ పోర్టల్÷-లో ఫిర్యాదులకు అవకాశం
- పథకం ప్రారంభించాక రైతులతో సిఎం చంద్రబాబు ముచ్చట్లు

**ఒంగోలు,ఆగస్ట్2(పద్మక్రాంతి):**



అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రాష్ట్రంలోని 46,85,838 మంది రైతులకు లబ్ధి చేకూరిందని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. మొదటి విడతలో రాష్ట్ర వాటాగా ఒక్కో రైతుకు రూ.5,000 చొప్పున జమ చేశాం. దీనికోసం రూ.2,343 కోట్ల నిధుల్ని కేటాయించాము. మొదటి విడతలో కేంద్ర ప్రభుత్వం తన వాటాగా రూ.2,000 చొప్పున రూ.832 కోట్లు ఇస్తోంది. మొదటి విడతలో కేంద్రం- రాష్ట్ర వాటాలు కలిపి ఒక్కో రైతుకు రూ.7,000 జమ చేశాం. ఈ విడతలో రైతులకు రూ.3,175 కోట్ల మేర లబ్ధి కలుగుతోందని అన్నారు. పథకం అమలుకు సంబంధించి

మిగతా 3 లో



3 లో

## బనకచర్లపై లోకేశ్‌వి అవగాహన లేని మాటలు

- మిగులు జలాల గురించి అప్పుడే ఎలా తేలుస్తారు
- కెటిఆర్‌తో రహస్య భేటీ తరవాతనే తెరపైకి బనకచర్ల
- డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క సంచలన వ్యాఖ్యలు

RNI No : TELTEL/2022/85167
పద్మక్రాంతి
(వాస్తవాలు వెలుగులోకి) తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## ఎదురుదాడితో... అక్రమాలను దాచలేము !

ఎదురుదాడి రాజకీయాల్లో ఇప్పుడు బిఆర్ఎస్, ఎపిలో వైకాపాలు ఆరితేరాయి. చేసిన తప్పులు, అప్పుల గురించి ఎవ్వరూ చర్చించుకోవద్దన్న పాలసీతో వీరు ఎదుటివారిపై బురదజల్లాలనే ప్రయత్నంలో ఉన్నారు. ఇద్దరూ ఒకే గూటి పక్షులుగా ఉన్నారు. ఎపిలో అప్పులు చేసి, బటన్ నొక్కుళ్లతో రాష్ట్రాన్ని దివాళా తీయించి, సొంత ఖజానా నింపుకున్న ఘనుడు జగన్. తెలంగాణలో కూడా కుటుంబం గుప్పిట్లో అధికారం పెట్టుకుని రాష్ట్రాన్ని దివాళా తీయించిన ఘనత కెసిఆర్ కుటుంబానిది. అంతేగాకుండా లెక్కకు మిక్కిలి అప్పులు చేసి ఇప్పుడేమో....మాకా సంగతే తెలియదన్న రీతిలో పోజులు పెడుతున్నారు. కెటిఆర్, హరీష్ రావుల విమర్శలు చూస్తుంటే సిగ్గేస్తోంది. జాలి కలుగుతోంది. ఎందుకంటే చేసిన తప్పులన్నీ చేసి, మళ్లీ తమదే అధికారం కనుక ఇవేవీ బయటపడవన్న ధీమాతో ఉండిపోయారు. కానీ ప్రభుత్వం మారడంతో అప్పులు, తప్పులు బయటకు తన్నుకు వస్తున్నాయి. వీటిని కప్పిపుచ్చుకునేందుకు రోజుకో అంశంపై విమర్శలు చేస్తున్నారు. గురుకులాలు, హాస్టళ్లు, రైతులు, బనకచర్ల, విద్యుత్ పంపిణీ తదితర అంశాలపై వీరు చేస్తున్న విమర్శలు అన్నీ ఇన్నీ కావు. నిజంగానే పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో ఇవన్నీ బాగావుంటే, బాగుచేసివుంటే ఇప్పుడే పాపం ఎందుకు బద్దయలయ్యిందన్నది ప్రజలు ఆలోచించాలి. అన్నింటికి మించి కాళేశ్వరంలో లక్షకోట్లు తగలేశారు. వారికి రావాల్సిన ముడుపులు రావడంతో ఏమయితే మనకేంటన్న ధోరణిలో ఉన్నారు. అందుకే ఇవన్నీ ప్రజలు చర్చించుకోవద్దన్న భావనలో రోజూ బనకచర్లను ముందుకేసి విమర్శలు చేసస్తున్నారు. సిఎం ప్రజల్లోకి రావడమెందుకు, ఆయన ప్రజలను కలవాల్సిన పనేముందని వాదించిన కెటిఆర్ ఇప్పుడు పనిచేసే ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నాడు. నవ్విపోదురు నాకేంటి అన్న చందంగా కెటిఆర్,హరీష్ రావుల విమర్శలకు హద్దూపద్దూ లేకుండా పోతోంది. అలాగే జగన్ తీరు కూడా అలాగే ఉంది. వీరు దోచుకోవడం అన్న స్కూళ్లో శిక్షణ పొంది వచ్చినవారు. ఇక కాళేశ్వరం నివేదిక చూస్తే ఆశ్చర్యం కలగమానదు. కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీల నిర్మాణంలో లోపాలు, వైఫల్యాల్లో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ పాత్ర కీలకమని జస్టిస్ పినాకిచంద్ర ఘోష్ కమిషన్ తేల్చింది. ఈ విషయంలో ఆయన పాత్ర విస్మరించలేనిదని స్పష్టం చేసింది. ఆయనతోపాటు ఆనాటి నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు, ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ తమ బాధ్యతలను సరిగా నిర్వర్తించలేదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. అంతేకాకుండా.. అప్పటి సీఎంవో కార్యదర్శి స్మితా సబర్వాల్, ఈఎన్‌సీలుగా పనిచేసినవారు, మరికొందరు అధికారులను కూడా వైఫల్యాలకు బాధ్యులుగా పేర్కొంటూ నివేదిక రూపొందించింది. బ్యారేజీల నిర్మాణానికి మంత్రివర్గ ఆమోదమే తీసుకోలేదని తెలిపింది. బ్యారేజీలపై ముందుగానే నిర్ణయం తీసుకొని.. తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత లేదన్న సీడబ్ల్యూసీ నివేదికను కేవలం సాకుగా చూపించారని వెల్లడించింది. పైగా బ్యారేజీల నిర్మాణానికి ముందు భూ భౌతిక పరీక్షలను శాస్త్రీయ ప్రమాణాలతో జరపలేదని పేర్కొంది. కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై విచారణ జరిపిన కమిషన్ గురువారం ప్రభుత్వానికి నివేదిక ఇవ్వగా.. దానిని శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అందజేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు నిర్మించేందుకు మంత్రివర్గం ఆమోదం తీసుకోలేదని, మంత్రివర్గ ఉపసంఘం వేసినా.. దీనికి, ఆ బ్యారేజీలకు సంబంధమే లేదని పీసీ ఘోష్ కమిషన్ తేల్చిందని తెలుస్తోంది. వీటి గురించి కెటిఆర్ మాట్లాడరు. హరీష్ రావు మాట్లాడరు. నోరుంది కదాని తప్పుడు మాటలతో మభ్య పెట్టే ప్రయత్నాల్లో ఈ ఇద్దరూ ఆరితేరారు. అయితే మంత్రివర్గ ఆమోదంతోనే బ్యారేజీలు నిర్మించినట్లు కమిషన్ క్రాస్ ఎగ్జామినేషన్‌లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రులు టి.హరీశ్‌రావు, ఈటల రాజేందర్ చెప్పడం ఇంకా మోసం చేయడం తప్ప మరోటి కాదు.

ఒక ఉద్యమ పార్టీగా ప్రజల ఆకాంక్షలకు న్యాయం చేయకుండా వారి నమ్మకాన్ని దెబ్బతీసింది. ఒక కుటుంబానికి వ్యాపార సామ్రాజ్యంగా మారిందనడానికి కాళేశ్వరం సహా అనేక ఉదాహరణలు ఉన్నాయి. గొర్రెల పంపిణీలో వేయికోట్ల మోసం అంటే ఎంత దారుణమో గుర్తించాలి. ఒక ఉద్యమ పార్టీ ఎంతగా అహంకారంగా ప్రవర్తించిందో చూసాం. ప్రజలు ఎలా మోసపోయారో చూసాం. ఇందుకు కాళేశ్వరం, గొన్నెలు, చేపలు, రైతుబంధు వంటి అన్ని పథకాలు చూడవచ్చు. సిఎం రిలీఫ్ ఫండ్ పేరుతోనూ మోసాలు సాగించారు. ఇప్పుడు బీఆర్ఎస్ ఓటమిని జీర్ణించుకోలేక అనవసరంగా గట్టిగా రంకెలు వేస్తోంది. ఒక్కో అవినీతి బయటపడ్డా కొద్దీ జీర్ణించుకోలేక పోతున్నది. తెలంగాణ కోసం పోరాడిన ప్రతి కుటుంబం, ప్రతి యువకుడి ఆశయాల మీద చేసిన మోసపూరి రాజకీయం బహుశా చరిత్రలో ఎవరూ చేసివుండరు.

ఒక నాయకుడు తప్పు చేస్తే దాన్ని ప్రజల ముందుకు తీసుకురావడం మీడియా బాధ్యత. కానీ ఇక్కడ పార్టీతో పాటు,ఓ కుటుంబం మోసం చేసింది.అయినా పదేళ్లుగా మీడియా ఈ విషయం ప్రసారం చేయలేదు. దాన్ని ఇప్పుడైనా ప్రశ్నించాలి. మీడియా స్వేచ్ఛను అణచివేయాలని చూసిన ఘనులు బిఆర్ఎస్ నేతలు. ప్రజాస్వామ్యంలో అది క్షమించదగినది కాదు. అసలు బీఆర్ఎస్ పార్టీ ప్రజాస్వామ్యాన్ని నమ్ముకుని అమ్ముకోవడమెలాగో నేర్చింది. ఇన్న తప్పులకు కారణమైన కెటిఆర్, హరీష్ రావులు ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి చేస్తున్న విమర్శలు...దగుల్బాజీ రాజకీయాలకు పరాకాష్టగా చూడాలి. నిరాశా నిస్పృహల్లో ఉంటూ ప్రస్తుత పరిస్థితిని చూసి తట్టుకోలేని మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. అందుకే అసందర్భ ప్రేలాపనలు చేస్తున్నారు. రాజకీయాల్లో నీతిగా మాట్లాడటం బిఆర్ఎస్, వైకాపా నాయకులకు రాదు. వీరు పాలనార్హత లేనివారు. ప్రజల తీర్పును గౌరవించలేక, దాన్ని హేళన చేయడమంటే అది ప్రజల ను నిందించడమే అవుతుంది. జగన్, కెటిఆర్‌లు ఇది గమనించాలి. ప్రజలను అవమానిస్తున్న ఈ నేతలను ప్రజలు దూరంగా పెట్టాలి. బీఆర్ఎస్ పదేళ్ల పరిపాలనలో తెలంగాణకు సాధ్యమైనంత మోసం చేయమెలా అన్న రీతిలో పాలన సాగింది. ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్ష మేరకు అసలు ప్రజల జీవితాల్లో మార్పు తీసుకుని రాలేకపోయింది.రైతులు అప్పుల్లోనే ఉన్నారు, యువత నిరుద్యోగంలో ఉన్నారు. రుణమాఫీ రాయితీల పేరుతో కొంతమంది మాత్రమే లబ్ధి పొందారు. పేపర్ లీకులు, గ్రూప్ పరీక్షల వాయిదాలు, పోలీస్ పరీక్షల గందరగోళం ఇవన్నీ యువత భవిష్యత్తును నాశనం చేశాయి.బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో తెలంగాణ అప్పు రూ. 6.5 లక్షల కోట్లకు చేరింది. కాళేశ్వరం, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ ఇవన్నీ పేరుకి ప్రాజెక్టులు. కానీ అన్నీ అవినీతి పథకాలే. జేబులు నింపే పథకాలే. గ్రామాల్లోకి తాగునీరు, విద్య, ఆరోగ్య పరిరక్షణకు తీసుకున్నచర్యలు లేవు. ఇవన్నీ కూడా ఇక్కడ బిఆర్ఎస్‌కు ఎపిలో వైకాపాకు వర్తిస్తాయి.

# ట్రంప్ చెంప ఛెళ్లమనిపించిన ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్

**డెడ్ ఎకానమీ అంటూ చేసిన ప్రకటపై ఎఐ దిమ్మతిరిగే సమాధనం**

**భారత్ ఆర్థిక వ్యవస్థ పురోగమిస్తోందని జవాబు**

న్యూయార్క్,ఆగస్ట్2(పద్మక్రాంతి):



ప్రస్తుత సాంకేతిక యుగంలో ఓపెన్ ఏఐ, చాట్‌జీపీటీ- వంటి వాటికి ప్రత్యేక ఆదరణ ఉంది. ఎలాంటి ప్రశ్నలకైనా ఈ కృత్రిమ మేధస్సు ప్లాట్‌ఫామ్‌లు సమాధానం చెబుతున్నాయి. తాజాగా ట్రంప్ భారత ఆర్థిక వ్యవస్థపై చేసిన వ్యాఖ్యలపై ఇవి నిర్మొహమాటంగా ట్రంప్ చెంప ఛెల్లుమనేలా సమాధానం ఇచ్చాయి.భారత ఆర్థిక వ్యవస్థ పతనమైందంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల తీవ్ర వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఇదే ప్రశ్నను పలు ఏఐ ప్లాట్‌ఫామ్‌లను అడగ్గా.. అవి చెప్పిన సమాధానాలు ట్రంప్ మూర్ఖత్వాన్ని తెలియచేశాయి. భారత్‌ది డెడ్ ఎకానమీయా? అని ఐదు ప్రధాన అమెరికన్ ఏఐ ప్లాట్‌ఫామ్‌లను ప్రశ్నించగా.. వాటి సమాధానాలు ట్రంప్ వ్యాఖ్యలకు విరుద్ధంగా ఉన్నాయి. భారత ఆర్థికవ్యవస్థ పతనం కాలేదు. అది డైనమిక్. ఎంతో ప్రతిష్ఠాత్మకమైనది' అని చాట్‌జీపీటీ పేర్కొంది.

భారత్‌ది డెడ్ ఎకానమీ కాదు. ప్రపంచవ్యాప్తంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో ఒకటని గ్రోక్ వెల్లడించింది. భారత ఆర్థిక వ్యవస్థ బలంగా వృద్ధి చెందుతుంది' - జెమిని తెలిపింది. ఇక, మెటా ఏఐ, కోపైలట్ లు కూడా ఇలాంటి సమాధానాలే ఇచ్చాయి. రష్యాతో వాణిజ్య సంబంధాలు కొనసాగిస్తుందనే కారణంతో భారత్‌పై 25శాతం సుంకం, పెనాల్టీలు విధిస్తున్నట్లు- ట్రంప్ ప్రకటించారు. దీన్ని ప్రకటించిన కొన్ని గంటల్లోనే మన ఆర్థిక వ్యవస్థను ఉద్దేశిస్తూ తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. రష్యా, భారత్.. వాటి డెడ్ ఎకానమీలను మరింత దిగజార్చుకునే అవకాశముందన్నారు. వారు ఎలాంటి వాణిజ్య సంబంధాలు కుదుర్చుకున్నా పట్టించుకోనన్నారు. ఈ వ్యాఖ్యలను భారత్ తోసిపుచ్చింది. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు. మరోవైపు, ట్రంప్ మాటలను లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సమర్థించారు. ట్రంప్ చెప్పింది వాస్తవమేనని, ఆ విషయాన్ని ప్రధాని, ఆర్థిక మంత్రికి తప్ప అందరికీ తెలుసని ఎద్దేవా చేశారు. దేశ ఆర్థిక, రక్షణ, విదేశాంగ విధానాన్ని భాజపా నేతృత్వంలోని ప్రభుత్వం నాశనం చేసిందని ఆరోపించారు. అయితే, రాహుల్ వ్యాఖ్యలను సొంత పార్టీ నేతలు సైతం తప్పుబట్టడం గమనార్హం. ఈ క్రమంలో ఎఐ సమాధానాలు ట్రంప్‌కు, రాహుల్‌కు చెంపపెట్టులాంటివే.

# ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ



**తన ఓటు గల్లంతయ్యిందన్న తేజస్వీ**

పాట్నా,ఆగస్ట్2(పద్మక్రాంతి):

బిహార్ శాసనసభ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా ముసాయిదాను ఎన్నికల సంఘం శుక్రవారం ప్రచురించిన సంగతి తెలిసిందే. దీనిపై విపక్షాలు తీవ్రంగా మండిపడు తున్నాయి. తాజాగా ఆర్జేడీ నేత, మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ స్పందిస్తూ.. ఈ ముసాయిదా జాబితాలో తన పేరే లేదని ఆరోపించారు. పట్నాలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. నా ఈపీఐసీ నంబరుతో ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో చెక్ చేశా. ఈ ముసాయిదా జాబితాలో నా పేరు కన్పించలేదు. ఇక నేను ఎన్నికల్లో ఎలా పోటీ చేయాలి? స్వయంగా బూత్ లెవల్ అధికారి నావద్దకు వచ్చి ఫామ్ తీసుకెళ్లారు. అయినా నా పేరు జాబితాలో లేదని తేజస్వీ వెల్లడించారు. ప్రత్యేక సమగ్ర సవరణ పక్రియ అనంతరం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి దాదాపు 20వేల నుంచి 30వేల వరకు ఓటర్లను తొలగించాలని ఆర్జేడీ నేత ఆరోపించారు. మొత్తంగా రాష్ట్రంలో దాదాపు 65 లక్షల ఓటర్లను తొలగించారని పేర్కొన్నారు. అయితే, తేజస్వీయాదవ్ చేసిన ఆరోపణలను కేంద్ర ఎన్నికల సంఘం ఖండించింది. ముసాయిదా జాబితాలో ఆయన పేరు ఉందని పేర్కొంది. అందుకు సంబంధించిన కాపీని కూడా విడుదల చేసింది. ఆర్జేడీ నేత బహుశా తన పాత ఈపీఐసీ నంబరుతో చెక్ చేసుకుని ఉంటారని, అందుకే ఆయన పేరు జాబితాలో కన్పించకపోయి ఉండొచ్చని ఈసీ తెలిపింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పూర్తవటంతో ఈసీ ఈ ముసాయిదా జాబితాను రూపొందించింది. జాబితా నుంచి 65 లక్షల మందిని తొలగించడంతో ఓటర్ల సంఖ్య 7.93 కోట్ల నుంచి 7.28 కోట్లకు తగ్గింది. దీనిపై అభ్యంతరాలు తెలిపేందుకు సెప్టెంబరు 1 వరకు ఈసీ గడువు కల్పించింది. బిహార్‌లో ఈ ఏడాది చివర్లో అసెంబ్లీ ఎన్నికలు జరగ నున్నాయి.

# లోక్‌సభ ఎన్నికల్లో భారీ రిగ్గింగ్

- బిజెపికి అనుకూలంగా ఎన్నికల సంఘం పనితీరు
- దాని ఆధారాలు తమవద్ద ఉన్నాయి
- తాము అధికారంలోకి వచ్చాక దేనినీ వదలం
- అధికారులు రిటైర్ అయినా పట్టుకుని శిక్షిస్తాం
- కాంగ్రెస్ న్యాయసమీక్ష సదస్సులో రాహుల్

న్యూఢిల్లీ,ఆగస్ట్2(పద్మక్రాంతి):



మొన్నటిలోక్‌సభ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందని, దానికి సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ అన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన వార్షిక న్యాయ సదస్సులో పాల్గొని ఆయన మాట్లాడారు. భారత దేశంలో ఎన్నికల సంఘం న్యాయ సమ్మతంగా పనిచేయడం లేదని ఆయన ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికలను రిగ్గింగ్ చేయవద్దు అని, 2024 లోక్‌సభ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందని రాహుల్ తెలిపారు. ఆ రిగ్గింగ్‌కు చెందిన డేటా, డాక్యుమెంట్లు- తమ వద్ద ఉన్నాయన్నారు. దీన్ని మేం నిరూపిస్తామని, ఆ డేటా ఇప్పుడు ఉందని రాహుల్ పేర్కొన్నారు.

ఓ లోక్‌సభ నియోజకవర్గానికి చెందిన అధ్యయనాన్ని ఆయన వెల్లడించారు. ఆ నియోజకవర్గంలో ఉన్న 6.5 లక్షల ఓటర్లలో 1.5 లక్షల ఓట్లు నకిలీ అని పేర్కొన్నారు. అలా ఫ్రాడ్ చేసి బీజేపీ అధికారంలోకి వచ్చిందని, 15 లేదా 20 సీట్లు తగ్గి ఉంటే, అప్పుడు మోదీ ప్రధాని అయ్యేవారు కాదని రాహుల్ అన్నారు. ఇండియాలో ఎన్నికల సంఘం చచ్చిపోయిందని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల్లో రాజస్థాన్, మధ్యప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఒక్క సీటు- గెలవలేదని, నాకు ఆశ్చర్యం వేసిందని, ఎప్పుడైనా ఎన్నికల అవకతవకల గురించి మాట్లాడితే ఆధారాలు అడుగుతున్నారని రాహుల్ అన్నారు. అయితే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల వేళ ఆ మార్పు కనిపించిందని, లోక్‌సభకు.. విధానసభకు ఎన్నికల జరిగిన సమయంలో కొత్తగా కోటి ఓటర్లు జత కలిశారని, దాంట్లో ఎక్కువ శాతం ఓట్లు బీజేపీకి వెళ్లాయని, అందుకే తన వద్ద ఆధారాలు ఉన్నట్లు చెబుతున్నాని రాహుల్ పేర్కొన్నారు. ఈ క్రమంలో మరోమారు భారత ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ రాహుల్ గాంధీమరోసారి విరుచుకుపడ్డారు. దేశంలో ఎన్నికల వ్యవస్థ పూర్తిగా కూలిపోయిందని అన్నారు. ఎన్నికల్లో భారత ప్రధాని నరేంద్ర మోదీ చాలా తక్కువ మెజారిటీతో మూడోసారి ప్రధానిగా గెలుపొందారని అన్నారు. భాజపాకు ప్రయోజనం చేకూర్చడానికి ఎన్నికల సంఘం ఓట్ల దొంగతనంలో పాలుపంచుకుందని ఆరోపించారు. 2014 నుంచి ఏదో తప్పు జరుగుతోందని తనకు అనిపిస్తోందని.. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల పైనా అనుమానాలు ఉన్నాయని రాహుల్ అన్నారు.

ఎన్నికల దుర్వినియోగానికి సంబంధించిన అన్ని ఆధారాలు తమవద్ద ఉన్నాయని.. లోక్‌సభ ఎన్నికల్లో రిగ్గింగ్ ఎలా జరిగిందనే విషయాన్ని త్వరలోనే తాము ప్రజల ముందు నిరూపిస్తామని పేర్కొన్నారు. తాము బయటపెట్టే నిజంతో ఈసీ (ఊఈ) పునాదులు కదిలిపోతాయన్నారు. ఓట్ల కుంభకోణంలో పాల్గొన్న ఎన్నికల కమిషన్ అధికారులు పదవీవిరమణ చేసినా కూడా వారిని వదలమని హెచ్చరించారు. భాజపా కోసం ఈసీ ఓట్ల చోరీకి పాల్పడుతోందని ఆరోపించిన ఆయన.. దాన్ని రుజువు చేసేందుకు తమవద్ద అణుబాంబు లాంటి ఆధారాలున్నాయని అన్నారు. కాగా ఈ ఆరోపణలను ఈసీ తీవ్రంగా ఖండించింది. అవన్నీ నిరాధార ఆరోపణలేనని.. రాహుల్ లాంటి వారు చేస్తోన్న బాధ్యతారాహిత్య వ్యాఖ్యలను పట్టించుకోనక్కర్లేదని తెలిపింది.

# అత్యాచారం కేసులో రేవణ్ణకు జీవిత ఖైదు

- పదిలక్షల పరిహారం కూడా ఎల్లించాలని ఆదేశం
- ప్రజాప్రతినిధుల ప్రత్యేక న్యాయస్థానం శిక్ష ఖరారు

బెంగళూరు,ఆగస్ట్2(పద్మక్రాంతి):



ఇంట్లో పనిమనిషిపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడిన కేసులో మాజీప్రధాని దేవేగౌడ మనవడు, హాసన్ మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ కు జీవిత ఖైదు పడింది. దీంతోపాటు- రూ.10లక్షల జరిమానా విధిస్తూ బెంగళూరులోని ప్రజాప్రతినిధుల ప్రత్యేక న్యాయస్థానం శిక్ష ఖరారు చేసింది. బాధితురాలికి రూ.7లక్షల పరిహారం ఇవ్వాలని ఆదేశించింది. ఇటీవల విచారణను పూర్తి చేసిన న్యాయమూర్తి సంతోశ్ గజానన హెగ్డే.. రేవణ్ణను దోషిగా తేల్చిన విషయం తెలిసిందే. అంతకుముందు ఇదే కేసులో తనకు తక్కువ శిక్ష వేయాలంటూ న్యాయమూర్తిని మాజీ ఎంపీ వేడుకున్నాడు. ఆ సమయంలో అతడు బిగ్గరగా ఏడ్చాడు. ఆగస్టు 1న తీర్పు ప్రకటించిన తర్వాత కూడా ప్రజ్వల్ కన్నీరుమున్నీరుగా విలపించాడు. న్యాయస్థానం నుంచి బయటకు వచ్చిన అనంతరమూ వెక్కివెక్కి ఏడ్చాడు. కేఆర్ నగరకు చెందిన మహిళ 2024 ఏప్రిల్ 28న హొళెనరసీపుర ఠాణాలో ప్రజ్వన్ రేవణ్ణపై ఫిర్యాదు చేయడంతో ఆయనపై అత్యాచారం కేసు నమోదు చేసింది. గన్నిగడ ఫాంహౌస్‌లో తనపై అత్యాచారం జరిగిందని బాధితురాలు (47) తన ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం మరికొన్ని అత్యాచార కేసులు ప్రజ్వల్‌పై నమోదయ్యాయి. ఈ కేసు విచారణలో భాగంగా 14 నెలలుగా ప్రజ్వల్ కారాగారంలో విచారణ ఖైదీగా ఉండగా తాజాగా శిక్ష ఖరారైంది. అత్యాచారం కేసులో శనివారం కోర్టు ఆయనకు ప్రజ్వల్ రేవణ్ణకు జీవిత ఖైదు విధిస్తూ తీర్పు వెల్లడించింది. అత్యాచారం, లైంగిక వేధింపులు, సాక్ష్యాలను నాశనం చేయడం, అత్యాచారానికి సంబంధించిన వీడియోలను సర్క్యులేట్ చేయడం వంటి ఆరోపణలపై దోషిగా తేలడంతో రేవణ్ణకు జీవిత ఖైదుతోపాటు- కోర్టు రూ.10 లక్షల జరిమానా కూడా విధించింది. లైంగిక వేధింపులు, అత్యాచారం సమయంలో వీడియోలను రికార్డ్ చేశాడని.. ఎవరికైనా చెబితే ఆ వీడియోలను విడుదల చేస్తానని బెదిరించాడని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు.

RNI No : TELTEL/2022/85167

పద్మక్రాంతి

(వాస్తవాల వెలుగులోకి) తెలుగు దినపత్రిక




## ఆగస్టు 5వ తేదీ ధర్నాను జయప్రదం చేయండి.

- ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ
- ధర్నా కరపత్రం ఆవిష్కరణ...

**పాపన్నపేట, ఆగస్టు 2. (పద్మక్రాంతి)**

ఉపాధ్యాయ, పాఠశాల విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 5 న మెదక్ లో తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని యూఎస్పీసి నాయకులు కోరారు. ఈ సందర్భంగా వారు కుర్తివాడలో ధర్నా పోస్టర్ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా టీఎస్ యూటీఎఫ్, టి పి టీ ఎఫ్ నాయకులు మాట్లాడుతూ గతంలో ఇచ్చిన హామీ ప్రకారం 5571 పిఎస్ హెచ్ఎం పోస్టులను మంజూరు చేసి.. పదోన్నతులు ద్వారా నింపాలన్నారు. సర్వీస్ రూల్ రూపొందించి రెగ్యులర్ ఎంఈఓ లను నియమించాలని, నూతన పెన్షన్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ లో ఉన్న డిఏ లను, పీ ఆర్ సీ ని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. జిఓ 317 కారణంగా స్థానికత కోల్పోయిన వారికి న్యాయం చేయాలని, వారిని సొంత జిల్లాలకు పంపాలని. జెడ్పి జిపిఎఫ్, టీఎస్ జిఎల్ఐ, సరెండర్ లీవ్స్ మరియు పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయలకు విరమణ రోజునే రావలసిన అన్ని బకాయిలు చెల్లించాలి అని డిమాండ్ చేశారు.. ఈ కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు బత్తుల. భూషణం, జిల్లా కార్యదర్శి నాచారం శేఖర్, జిల్లా నాయకులు కె.వి.ఆర్ నాయుడు, మల్లేశం మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రేషన్ కార్డులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కోవ లక్ష్మి

**రెబ్బెన, ఆగస్టు, 2 (పద్మక్రాంతి)**




ఆసిఫాబాద్ నియోజకవర్గం రెబ్బెన మండల కేంద్రం లో అర్హులైన లబ్ధిదారులకు రేషన్ కార్డులు ఎమ్మెల్యే కోవ లక్ష్మి పంపిణీ చేశారు. రేషన్ కార్డుల పంపిణీలో ఎటువంటి అవకతవకలు లేకుండా అర్హులైన వారికే అందేలా చూడాలని కోవ లక్ష్మి కోరారు. భవిష్యత్తులో కూడా ప్రజలందరికీ అండగా ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో జెసి, ఆర్డీవో, ఎమ్మార్వో, ఎంపీడీవో, వివిధ శాఖల అధికారులు, వివిధ పార్టీల రాజకీయ నాయకులు, కార్యకర్తలు, చుట్టు ప్రక్కల గ్రామస్థులు, పాల్గొన్నారు.

## పట్టు సాధించేలా ఉండాలి



**పాపన్నపేట, ఆగస్టు. 02. (పద్మక్రాంతి)**

కుర్తివాడ ఉన్నత పాఠశాలలో ఉన్నత స్థాయి మాథ్స్ కాంప్లెక్స్ మీటింగ్ శనివారం జరిగింది. టేక్మాల్, పాపన్నపేట గణిత శాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈసందర్భంగా మెదక్ జిల్లా విద్యాధికారి రాధాకిషన్ విచ్చేసి మాట్లాడారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు.విద్యార్థులు గణితశాస్త్రం పై పట్టు సాధించేలా బోధన చేయాలని వారికీ ఆదేశించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు,ఉపాధ్యాయులు భవాని ప్రసాద్,వెంకటేశం, శివకుమార్, కిషన్, విక్రమ్ గౌడ్, రిసోర్స్ పర్సన్ బాలరాజు,పవన్ సిఆర్పీ దేవయ్య ఉన్నారు.

## నియోజకవర్గంలో రేషన్ కార్డులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే.



**కొమరం భీమ్ ఆసిఫాబాద్, ఆగస్టు 2,(పద్మక్రాంతి ప్రతినిధి):**

ఆసిఫాబాద్ నియోజకవర్గం వాంకిడి మండలంలోని రైతు వేదిక కేంద్రం లో అర్హులైన లబ్ధిదారులకు రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమం లో ముఖ్య అతిధిగా పాల్గోన్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి. లబ్ధిదారులకు రేషన్ కార్డులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ

ఈ కార్యక్రమానికి వచ్చిన ప్రజలకు, అధికారులకు ధన్యవాదములు తెలుపుతూ, రేషన్ కార్డుల పంపిణీలో ఎటువంటి అవకతవకలు లేకుండా, అర్హులైన వారికే అందేలా చూస్తామన్నారు.

రేషన్ కార్డుల పంపిణీ అనేది ఒక రాజకీయ కార్యక్రమం కాదని, ఇది సమాజంలోని పేద ప్రజల కడుపు నింపే కార్యక్రమం అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలి, తొందరలో హామీలు అమలుచేయాలి అని అన్నారు.భవిష్యత్తులో కూడా ప్రజలందరికీ అండగా ఉంటానని, మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను అందిస్తామని ఎమ్మెల్యే అన్నారు.రేషన్ కార్డులు పొందిన లబ్దిదారులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఈ కార్యక్రమానికి వచ్చినందుకు ప్రజలకు,అధికారులకు మరోసారి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమం లో ఎంపీడీఓ,ఎమ్మార్వో, రెవిన్యూ అడిషనల్ కలెక్టర్, సింగిల్ విండో చైర్మన్ పెంటయ్య, పారెపెల్లి అజయ్,ఎంగిలి రాకేష్, గుండి రవి,బబ్లు,కొండ రవి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.





# ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం 55వ స్నాతకోత్సవం

## 2021 -22 మధ్య ఉత్తీర్ణులైన 844 మంది విద్యార్థులకు పట్టాలు ప్రధానం చేసిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



**పద్మక్రాంతి ఆగస్టు 02 (రాజేంద్రనగర్, ప్రతినిధి):**



ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం 55వ స్నాతకోత్సవం శనివారం రాజేంద్రనగర్ లోని విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. 2021-2022 మధ్య ఉత్తీర్ణులైన 844 మంది యుజీ,పీజీ, పిఎచ్.డి విద్యార్థులకి విశ్వవిద్యాలయ కులపతి, రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అధ్యక్షతన జరిగిన ఈ స్నాతకోత్సవంలో పట్టాలు ప్రధానం చేశారు. ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య వార్షిక నివేదికను సమర్పించారు. విశ్వవిద్యాలయం వివిధ పంటల్లో విడుదల చేసిన వంగడాలు జాతీయస్థాయిలో ఆదరణ పొందుతున్నాయని అల్దాస్ జానయ్య తెలిపారు. బోధన, పరిశోధన, విస్తరణల్లో విశ్వవిద్యాలయం బహుముఖ ప్రతిభ కనబరుస్తుందన్నారు. దేశ, విదేశాలకు చెందిన అనేక ప్రముఖ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకున్నామని జానయ్య తెలిపారు. అగ్రి హబ్, ఇతర ల్యాబ్ ల్ని విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేశామని తెలిపారు. ఐసీఎఆర్, విశ్వవిద్యాలయ కులపతి జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ల తోడ్పాటుతో విశ్వవిద్యాలయాన్ని అత్యున్నత స్థాయికి తీసుకెళ్లడానికి కృషి చేస్తున్నామని జానయ్య వివరించారు.ఇండియన్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐసీఎఆర్) డైరెక్టర్ జనరల్, డిపార్ట్మెంట్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ (డేర్) కార్యదర్శి అయిన డాక్టర్ మంగీలాల్ జాట్ స్నాతకోత్సవ ప్రసంగం చేశారు. ఈ విశ్వవిద్యాలయంలో చదివిన ఎందరో వ్యక్తులు నేడు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమ స్థానాల్లో ఉండి దేశానికి, రైతాంగానికి సేవలు అందిస్తున్నారన్నారు. ఒకనాడు ఆహార కొరత ఎదుర్కొన్న దేశం నేడు ఆహార ధాన్యాల మిగులు స్థాయికి చేరుకుందని జాట్ అన్నారు. దీనికి శాస్త్ర విజ్ఞానం, ప్రభుత్వాల విధానాలు, రైతుల నిరంతర శ్రమలే దోహదం చేశాయన్నారు. నేడు తెలంగాణ, ఇతర రాష్ట్రాల కారణంగా దేశం వరి ఉత్పత్తిలో ప్రథమ స్థానంలో నిల్చిందన్నారు. భూగర్భజలాల క్షీణత, భూసార క్షీణత, పర్యావరణ విధ్వంసం, పర్యావరణ మార్పులు వంటి సవాళ్లను నేడు మనం ఎదుర్కొంటున్నామని జాట్ తెలిపారు. ఈ సవాళ్లను సమర్థంగా ఎదుర్కొని 2047 నాటికి "వికసిత్ భారత్" గా రూపాంతరం చెందటానికి అందరూ కృషి చేయాలన్నారు. స్థానిక పంటలను, తృణధాన్యాల పంటలను విరివిగా ప్రోత్సహించాలన్నారు. కొత్త కొత్త అంశాల్లో పరిశోధనలు చేపట్టాలని వ్యవసాయ రంగంలో డేటాని సమర్థంగా వినియోగించుకోవాలని, సహజ సేంద్రియ వ్యవసాయ, అంతర పంటల సాగులపై దృష్టి పెట్టాలని జాట్ సూచించారు. నూతన నైపుణ్యాల్ని ఉపయోగించుకోవాలని పరిశోధనల్ని రైతుల ముంగిటకు సాధ్యమైనంత త్వరగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ విశ్వవిద్యాలయాల్లో అధునాతన నైపుణ్యాలు, బోధనలకి పెద్దపీట వేయాలని, మానవ వనరుల యాజమాన్యాన్ని సమర్థవంతంగా చేపట్టాలని జాట్ అభిప్రాయపడ్డారు. అదేవిధంగా సంస్థల్లో అవసరమైన సంస్కరణలు చేపట్టి సంస్థలన్ని పూర్తి సమన్వయంతో పనిచేయాలన్నారు. వ్యవసాయ పరిశోధనల్లో పెట్టుబడులు మరింత పెరగాల్సిన అవసరం ఉందని జాట్ అభిప్రాయపడ్డారు. 1965లో నాటి ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి జాతికి అంకితం చేసిన ఈ వ్యవసాయ విశ్వవిద్యాలయం బహుముఖాలుగా విస్తరించడం చాలా గర్వకారణమని రాష్ట్ర గవర్నర్, విశ్వవిద్యాలయ కులపతి శ్రీ జిష్ణుదేవ్ వర్మ అభినందించారు. వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లకు దీటుగా పనిచేస్తూ వ్యవసాయ విశ్వవిద్యాలయం తన ప్రయాణాన్ని సాగిస్తుందన్నారు. దేశంలోనే తొలిసారిగా ఈ మధ్యనే పిజెటిఎయు , సెంటర్ ఫర్ డిజిటల్ అగ్రికల్చర్ ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. అదేవిధంగా స్మార్ట్, డిజిటల్ వ్యవసాయాల పరిశోధనలకు పెద్దపీట వేస్తూ ఎస్ బి ఐ ఫౌండేషన్ సహకారంతో అరిసా ల్యాబ్ ని పిజెటిఎయుఏర్పాటు చేస్తుందన్నారు. భవిష్యత్తులో విశ్వవిద్యాలయం దేశంలో తొలి పది స్థానాల్లో నిలవనుందని గవర్నర్ ఆశాభావం వ్యక్తం చేశారు. పిజేటీఎయు ఈ మధ్య నిర్వహించిన 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం, 'ప్రతి గ్రామానికి నాణ్యమైన విత్తనాలు' కార్యక్రమాల వల్ల రైతాంగానికి చాలా మేలు జరిగిందని వివరించారు.వాతావరణమార్పులు, మార్కెటింగ్ తదితర సవాళ్లకు అనుగుణంగా శాస్త్రవేత్తలు కొత్త పరిష్కారాలు చూపించాలన్నారు. యువతకి, మహిళలకి ఉపాధి కల్పించడంతోపాటు పేదరికం రూపుమాపి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో వ్యవసాయానిది ప్రధాన పాత్ర అని.. యువ పట్టభద్రులు రైతులకు నిరంతర సేవలందిస్తూ వారి సాగుని లాభసాటిగా చేసేందుకు కృషి చేయాలని గవర్నర్, విశ్వవిద్యాలయ కులపతి జిష్ణుదేవ్ వర్మ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పిజి, పిహెచ్ డి విద్యార్థులకు పట్టాలు ప్రధానం చేశారు. అదేవిధంగా అత్యుత్తమ ప్రతిభగల కనపరిచిన 20 మంది విద్యార్థులకు 30 బంగారు పతకాలు అందజేశారు. కంది అగ్రికల్చర్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన జి. భార్గవి బి.టెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) లో అత్యధిక ఒగపా సాధించినందుకు 6 బంగారు పతకాలు, వరంగల్ వ్యవసాయ కళాశాలకు చెందిన అర్షియా తబస్యుమ్ బస్సీ(ఆనర్స్), అగ్రికల్చర్ లో అత్యధిక ఒగపా సాధించినందుకు నాలుగు బంగారు పతకాలు పొందింది. ఈ స్నాతకోత్సవంలో రిజిస్ట్రార్ డాక్టర్ జి. ఈ. సిహెచ్ విద్యాసాగర్, విశ్వవిద్యాలయ పాలక మండలి సభ్యులు, విశ్వవిద్యాలయ అధికారులు, పూర్వ ఉపకులపతులు, రిజిస్ట్రార్ లు, ఐసీఎఆర్ సంస్థల ప్రతినిధులు,అధికారులు వివిధ బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## పీఎం కిసాన్ సమ్మాన్ నిధి సమ్మేళనానికి హాజరైన

# కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి





**పద్మక్రాంతి, ఆగస్టు 2,(యాచారం):**

భారత దేశంలో వ్యవసాయానికి మొదటి ప్రాధాన్యతనిస్తూ రైతు సమగ్ర అభివృద్ధి కోసం ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ కృషి చేస్తున్నట్లు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి తెలిపారు. శనివారం ఉత్తర ప్రదేశ్ వారణాసిలో ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి సమ్మేళనం కార్యక్రమాన్ని యాచారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి ఎస్ సి ఏ ఆర్ క్రీడా జోన్ ఏక్స్ డైరెక్టర్ వికేసింగ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి ఉష, సహాయ వ్యవసాయ సంచాలకులు సుజాత,ఆర్డిఓ అనంతరెడ్డి, వివిధ గ్రామాల నుండి విచ్చేసిన రైతులు కార్యక్రమాన్ని వీక్షించారు.అనంతరం కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేతుల మీదుగా 20500 కోట్ల రూపాయలు విడుదల చేసి 9.7 కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూరేలా పిఎం కిసాన్ నిధి ప్రారంభించినట్లు తెలిపారు.ప్రపంచ ఆర్థిక గణాంకాల ప్రకారం భారతదేశం నాలుగో స్థానంలో ఉందని నేడు మూడో స్థానానికి చేరే ప్రయత్నం కృషి జరుగుతుందన్నారు. ఆనాటి నుంచి ఈనాటి వరకు వ్యవసాయంపై మక్కువతో దేశంలో గణనీయంగా వృద్ధి జరిగిందని మన దేశం నేడు ఇతర దేశాలకు ఆహార ఉత్పత్తులు సరఫరా చేసే స్థాయికి అగ్రగామిగా నిలిచిందన్నారు. ఇతర దేశాలకు భారతదేశం అభివృద్ధి మింగుడు పడడం లేదన్నారు. 140 కోట్ల మంది జనాభాకు సరిపడా ఆహార ఉత్పత్తులు చేస్తూ ఇతర దేశాలకు ఎగుమతులు చేసి స్థాయికి వెళ్లి అగ్రస్థానం నిలుస్తూ శత్రుదేశం గుండెల్లో గుబులు పుట్టించే స్థాయికి చేరుకున్నామన్నారు. కరోనా కష్టకాలంలో కరోనా వ్యాక్సిన్ తయారుచేసి హైదరాబాదు నుండి 45 దేశాలకు ఉచితంగా కరోనా వ్యాక్సిన్ ను అందించిన ఘనత మనదే అన్నారు. పూర్వం మన దేశంలో పాల ఉత్పత్తుల కోసం ఇతర దేశాలపై ఆధారపడే పరిస్థితి ఉండేదని నేడు దేశంలో పాల ఉత్పత్తుల్లో ఎంతో అభివృద్ధి సాధించి మెరుగైన పోషకాహారాలను అందిస్తున్నామన్నారు. దేశాన్ని అభివృద్ధి పథంలో నడుపుతూ బడుగు బలహీన వర్గాల కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. రైతుల అభ్యున్నతి కోసం దాన్యం మద్దతు ధర 2380 అందజేస్తూ రైతుకు ఎంతో బసటగా నిలుస్తున్నారని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా నేడు దేశంలో విత్తనాలు మందులు నియంత్రణలో ఉంచి పది సంవత్సరాలలో వాటిని రైతులకు అతి తక్కువ ధరకు అందించే విధంగా విధివిధానాలు పాటిస్తున్నారని పేర్కొన్నారు.దేశంలో రైతాంగం కోసం 2300 కోట్ల రూపాయలని ఖర్చు చేసేవారు నేడు అందుకు భిన్నంగా నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో 26 వేల కోట్ల రూపాయలు ఖర్చు పెడుతుందని పేర్కొన్నారు. ఎరువుల ధరలలో యూరియా బస్తాకు 2600 రూపాయలు ఉండగా కేంద్ర ప్రభుత్వం సబ్సిడీతో 266 రూపాయలకే అందజేస్తున్న ఘనత కేంద్ర ప్రభుత్వానికి చెల్లుతుందన్నారు. మహిళా సమైక్య వారి అభివృద్ధి కోసం బ్యాంకుల్లో సకాలంలో రుణాలు చెల్లించాలని 20 లక్షల వరకు పొదుపు సంఘం కేంద్ర నుండి ఆదేశాలు ఉన్న విషయాన్ని తెలిపారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో డ్రోన్లను కొనుగోలు చేసి రైతులకు మహిళా సమైక్య ద్వారా తక్కువ ధరలకు వ్యవసాయం కోసం ఉపయోగించేలా ప్రభుత్వం నుండి మంజూరు అవుతున్న విషయాన్ని తెలియజేశారు.మిగులు బడ్జెట్ తో తెలంగాణ రాష్ట్ర ఏర్పడిదని నేడు రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందని , రాష్ట్రం అప్పుల్లో ఉందని భవిష్యత్తులో భారతీయ జనతా పార్టీ అధికారం లోకి వస్తే అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గుర్నాథ్ రెడ్డి, ఏం సి డైరెక్టర్లు మస్కి నరసింహ, గులాం అక్బర్,పి ఎస్ సి ఎస్ చైర్మన్ రాజేందర్ రెడ్డి, మాజీ ఎంపీపీలు రాచర్ల వెంకటేశ్వర్లు, కొప్పు సుకన్య భాష్యం,మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షులు కొండపల్లి శ్రీధర్ రెడ్డి, బిఎన్ఆర్ ట్రస్ట్ చైర్మన్ బిలకంటి చంద్రశేఖర్ రెడ్డి, భారతీయ జనతా పార్టీ నాయకులు మాజీ సర్పంచ్లు అంజయ్య యాదవ్ , దేరంగుల రాజు,విజయ్ కుమార్, శ్రీధర్ రెడ్డి, మూడేడ్ల వెంకట్ రెడ్డి, అధికార ప్రతినిధి వరికుప్పల సుధాకర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అరవింద్ నాయక్,నెర్రె శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

RNI No : TELTEL/2022/85167
పద్మక్రాంతి
తెలుగు దినపత్రిక

## పీఎం కిసాన్ నిధులు విడుదల





**పాపన్నపేట, ఆగస్టు. 02 (పద్మక్రాంతి)**

పీఎం కిసాన్ సమ్మాన్ నిధి నుండి 9.7 కోట్ల మంది రైతులకు 20 వ విడత నిధులు రూ. 20.500 కోట్లు విడుదలయ్యాయని మండల వ్యవసాయ అధికారి నాగమాధురి తెలిపారు. శనివారం పొడ్చన్ పల్లి రైతు వేదికలో జరిగిన పీఎం లైవ్ కార్యక్రమాన్ని రైతులతో కలిసి ఆమె వీక్షించి మాట్లాడారు. దీని ద్వారా రైతులకు ఏటా ఒక్కో విడత రూ. 2 వేల చొప్పున 3 విడతల్లో రూ. 6 వేల సాయం అందుతుందన్నారు. మండల లోని పలు రైతు వేదికలలో ఈకార్యక్రమం జరుగగా వ్యవసాయ విస్తరణ అధికారులు నాగరాజు,అసిఫ్, అభిలాష్,జనార్దన్,రజిత, రైతులు పాల్గొన్నారు.

## ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు



**పద్మక్రాంతి,ఆగస్టు2,(యాచారం):**

ఐసిడిఎస్ ఇబ్రహింపట్నం ప్రాజెక్ట్ యాచారం మండలంలోని నానక్ గ్రామంలో శనివారం సిడిపిఓ వీనితా దేవి ఆదేశాల మేరకు సూపర్వైజర్ తులసి ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవలు ఘనంగా నిర్వహించారు. అనంతరం సూపర్వైజర్ తులసి మాట్లాడుతూ..

"స్థిరమైన మద్ధతు ఇచ్చి వ్యవస్థలను ఏర్పరిచి తల్లిపాల సంస్కృతి ప్రోత్సాహానికి ప్రాధాన్యత ఇద్దాం అనే అంశాన్ని ఈ సంవత్సం 2025 తల్లిపాల వారోత్సవాల సందేశంగా ప్రకటించబడిది.

ఈ వారోత్సవం లో విహెచ్ఎస్ఎన్ డి గ్రామ ఆరోగ్య, పోషణ రోజు నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా పిల్లలకు తల్లులకు టికాలు,పోషణ గురించి వివరించారు. తల్లిపాల సంస్కృతి, అపోహాలు, నిజాలు,సలహాలు గురించి తల్లులతో చర్చిచడం ద్వారా వారికి అవగాహన ఏర్పడుతుంది అని అన్నారు.

ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ విమలాదేవి, ఏఎన్ఎం జయ, ఆశ వర్కర్ పద్మ, వివో సుజాత, తల్లులు బాలింతలు పాల్గొన్నారు.

## వైద్యుల నిర్లక్ష్యం వల్ల వ్యక్తి మృతి

- వెంకటరమణ ఆసుపత్రి ముందు ఉద్రిక్తత

**పద్మక్రాంతి, ఆగస్టు 2,(కల్వకుర్తి ప్రతినిధి ):**



కల్వకుర్తి పట్టణానికి చెందిన సాబేర్ చాతి నొప్పి భరించలేక వెంకటరమణ ఆసుపత్రికి రాత్రి వెళ్లగా డ్యూటీ డాక్టర్లు పరీక్షించి ఈసీజీ తీసి,కొన్ని మందులు ఇచ్చి ఇంటికి పంపించారు, ఇంటికి వెళ్లిన కాసేపటికి సాబేర్ కుప్పకూలి పోవడంతో మళ్లీ అతన్ని ఆసుపత్రికి తరలించారు పరీక్షించిన డ్యూటీ డాక్టర్ అప్పటికే సాబేర్ గుండెపోటుతో మృతి చెందినట్లు నిర్ధారించారు, ఈసీజీ తీసినప్పుడే సమస్య చెప్పి ఉంటే మేము మెరుగైన వైద్యం కోసం వెళ్లే వాళ్ళమని వైద్యుల నిర్లక్ష్యం వల్లే సాబేర్ మృతి చెందాడంటూ, మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలంటూ ఆసుపత్రిలో మృతుడి బంధువులు పెద్ద ఎత్తున ఆందోళన దిగారు, ఈ కార్యక్రమంలో, బాధితుని కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ జాతీయ కుటుంబ ప్రయోజన పథకం దరఖాస్తు చేసుకోవాలి

**- తాహసిల్దార్ హరి కిషోర్ శర్మ**

**నాగారం, ఆగస్టు 02 తుంగతుర్తి (పద్మక్రాంతి ప్రతినిధి) :**



కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జాతీయ కుటుంబ ప్రయోజన పథకం(ఎన్.ఎఫ్.బీ.ఎస్) కింద అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని నాగారం మండల తాహసిల్దార్ హరి కిషోర్ శర్మ తాసిల్దార్ కార్యాలయంలో మాట్లాడుతూ ఎన్.ఎఫ్.బీ.ఎస్ కింద దరఖాస్తు చేసుకునే వారు 18 నుండి 59 సంవత్సరాల వయసు ,12-04-2017 తరువాత భర్తలు మరణించిన స్త్రీ లకు కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.20 వేల రూపాయలు నగదు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. లబ్ది పొందేందుకు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ,కులం సర్టిఫికెట్స్ , భర్త మరణ ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంకు అకౌంట్ జిరాక్స్ లు, ఏ.పీ.ఎం వద్ద నుండి ఎన్ఓసి , నోటరీ ,పాస్ ఫోటోలను జతపరచిన తరువాత ధరఖాస్తును తాహసిల్దార్ కార్యాలయం అందజేసి ఈ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఒక ప్రకటనలో తెలిపారు.

# ప్రతి కాలనీ అభివృద్ధే లక్ష్యం..





## షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**షాద్ నగర్, 2 ఆగస్టు ( పద్మక్రాంతి ప్రతినిధి ):**

రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపాలిటీ లో 100 రోజుల ప్రణాళికలలో భాగంగా ప్రభుత్వం ఆధ్వర్యంలో 166 మున్సిపల్ కార్మికులకు ఉచితంగా కిట్టులను షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పంపిణీ చేశారు. అనంతరం 9 వార్డు లో మల్లికార్జున్ కాలనీ పార్కు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ

"ప్రతి కాలనీ అభివృద్ధి చేయడమే నా లక్ష్యం అన్నారు . ప్రజలకు మౌలిక సదుపాయాలు, శుభ్రత, మంచినీటి సరఫరా, డ్రైనేజ్ వ్యవస్థ, ప్రతి కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపడతామన్నారు.వచ్చే ఎన్నికల నాటికి అన్ని వార్డు లో అభివృద్ధి పూర్తయ్యేలా విధంగా చర్యలు చేపడతామన్నారు. దసరా పండుగ పురస్కరించుకొని ఎమ్మెల్యే మున్సిపల్ కార్మికులకు 2500 బోనస్ ప్రకటన చేశారు

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సునీత మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ బాబర్ అలీ ఖాన్, పట్టణ అధ్యక్షుడు కొంకళ్ళ చెన్నయ్య, నేతలు అగ్గనూర్ బస్వ%శీ%, చెంది తిరుపతి రెడ్డి,రఘు నాయక్,వెంకట్ రాం రెడ్డి, మహ్మద్ ఇబ్రహీం, అందె మోహన్ ముదిరాజ్,శ్రీనివాస్, శ్రీనివాస్ యాదవ్,ఖదీర్, వాసు, నల్లమోని శ్రీధర్, అర్జున్ లక్షన్, బాల గంగాధర్ తిలక్,కొప్పునూరి ప్రవీణ్,సాయి వంశీ, జయ ప్రకాష్,శ్రీశైలం గౌడ్,రాజేష్ గౌడ్,మాధువలు యాదవ్,దిలీప్,గణేష్ రాథోడ్,శ్రీనివాస్, జగన్ గౌడ్,శ్రీనివాస్ గౌడ్,రాజేష్ ముదిరాజ్, ప్రదీప్ ముదిరాజ్, కార్యకర్తలు, అధికారులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




## ఆదివాసి దినోత్సవ వేడుకలు

- ఘనంగా నిర్వహించాలి.
- తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షులు కోవ విజయ్ కుమార్.

**కొమరం భీమ్ ఆసిఫాబాద్, ఆగస్టు 2,(పద్మక్రాంతి ప్రతినిధి):**

కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రములో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలను జిల్లా కేంద్రంలో నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నట్లు తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షులు కోవ విజయ్ కుమార్ ప్రకటించారు. శనివారం జిల్లా కేంద్రంలోని తుడుం దెబ్బ జిల్లా కార్యాలయం యందు ప్రత్యేక సమావేశంలో తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షులు కొట్నక విజయ్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొనగా, జిల్లాలోని మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆగస్టు 9 ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్ ఆసిఫాబాద్ లో వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలకు ఆదివాసి సాంస్కృతిక,సాంప్రదాయ నృత్య వేడుకలు, డోలు, సన్నాయి అధిక సంఖ్యలో ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఈ కార్యక్రమానికి ఆదివాసి సంఘాలు, ప్రజా సంఘాలు, కార్మిక కర్షక మరియు అన్ని పార్టీల వారు ఆహ్వానితులే అని అన్నారు.అందరికీ ఇదే ఆహ్వానం అని ఇట్టి కార్యక్రమాన్ని ప్రపంచ ఆదివాసి దినోత్సవం అంగరంగ వైభవంగా జిల్లా కేంద్రంలో ఘనంగా జరుపుకొనుటకు ఆదివాసి గ్రామ పటేల్ దేవరి యువతీ,యువకులు, మహిళలు భారీ ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వీరితోపాటు తుడుం దెబ్బ జిల్లా గౌరవ అధ్యక్షులు (సలహాదారు) డాక్టర్ కనక ప్రభాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పెందోర్ మారుతీ, జైనూర్ మండల అధ్యక్షులు మడవి మదురాజ్, కెరమెరి మండల అధ్యక్షులు కుద్మేత సోము, వాంకిడి మండల ప్రధాన కార్యదర్శి పంద్రం సురేష్, వాంకిడి మండల ఉపాధ్యక్షులు గుండి రాజయ్య, మడవి బందు, ప్రచార కార్యదర్శి దూర్వ భాను ప్రకాష్, కేస్లాగూడ గ్రామ యువజన సంఘం నాయకుడు కినాక జ్యోతిరాం, కెరమెరి మండల కొలం సంఘం నాయకుడు మడవి రాజు మరియు తదితరులు పాల్గొన్నారు.




## గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మికులకు కనీస వేతనాలు 26వేలు ఇవ్వాలి.

- జీఓ నెంబర్ 51మల్టీ పర్పస్ విధానం రద్దు చెయ్యాలి.
- ఇన్సూరెన్స్ ప్రమాదంలో సౌకర్యం కల్పించాలి.
- పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలి.

**వికారాబాద్, ఆగస్టు 2, (పద్మక్రాంతి ప్రతినిధి):**

నవాబ్ పేట మండల కేంద్రంలో మాణిక్ ప్రభు గుడి వద్ద తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు మహాసభ బి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈసభకు ముఖ్యఅతిథిగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఆర్. మహిపాల్ పాల్గొని మాట్లాడారు. గ్రామపంచాయతీలలో అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న స్వీపర్సు, డ్రైవర్సు, వాటర్ మెన్, బిల్ కలెక్టర్ల, అటెండర్లకు కనీస వేతనాలు 26000 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ పాలకులు ఐదువేల నుంచి 9500 వరకు మాత్రమే నెల జీతాలు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనాలు అమలు చేయడంలో ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ఐదు సంవత్సరాలు ఉండే ఎమ్మెల్యేలకు లక్షలాది రూపాయల జీతం, ప్రమాదంలో ఇన్సూరెన్స్ పెన్షన్ సౌకర్యం ఉందన్నారు.

గ్రామాలలో పనిచేస్తున్న వర్కర్లకు మాత్రం కనీసం వేతనాలు ఇవ్వడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని విమర్శించారు. ఈ వర్షాకాల అసెంబ్లీ సమావేశాల సందర్భంగా జీవో నెంబర్ 51 మల్టీపర్పస్ విధానం రద్దుచేసి, కనీస వేతనాలు అమలు చేసే విధంగా అమలు చేయాలని కోరారు. సుప్రీంకోర్టు చెప్పిన గైడ్లెన్స్ మొత్తం అమలు చేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేస్తున్నామని హెచ్చరించారు. లేనిచో ఎమ్మెల్యేల ఇండ్లు ముట్టడించి గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యేవరకు నిరంతరం సిఐటియు యూనియన్ కార్మికుల కార్మికుల పక్షాన ఉండి పోరాటాలు చేస్తుందన్నారు. మండల మహాసభ అనంతరం మండల నూతన కమిటీ సభ్యులు ఎన్నుకన్నారు. కమిటీ అధ్యక్షులుగా కే. కుమార్, ప్రధాన కార్యదర్శిగా జంగయ్య, కోశాధికారిగా మల్లయ్య, ఉపాధ్యక్షులుగా అంజయ్య, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా శారద, మహేష్, కమిటీ సభ్యులుగా చన్ పాషా, కుమార్, లక్ష్మి, అంజయ్య, యాదమ్మ, బుచ్చయ్య, రాములు, యేసు, మానేయ మంజుల, శివరాజు, యాదమ్మ, సత్యమ్మ, లక్ష్మి, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కిటకిటలాడిన యాదాద్రి పుణ్యక్షేత్రం.



**పద్మక్రాంతి, యాదగిరిగుట్ట:**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదాద్రి క్షేత్ర సందర్శనకు భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తడంతో యాదాద్రి దేవస్థానం కిటకిటలాడింది. శ్రావణమాసం రెండో శనివారం కావడంతో స్వామివారి అమ్మవార్ల దర్శనం కోసం భక్తులు క్యూలైన్లో నిల్చోని దర్శనం చేసుకున్నారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి కళ్యాణోత్సవంలో సాయంత్రం వెండి జోడు సేవలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.




## మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన ఆసిఫాబాద్ ఎమ్మెల్యే.

**కొమరం భీమ్ ఆసిఫాబాద్, ఆగస్టు 2,(పద్మక్రాంతి ప్రతినిధి):**

కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా లోని వంకులం గ్రామ వాస్తవ్యులు అరె సంఘం జిల్లా అధ్యక్షులు బోర్కుటే తిరుపతి తండ్రి బోర్కుటే నాగయ్య ఇటీవలే అనారోగ్యం తో మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి మృతుడి నివాసానికి వెళ్లి, వారి చిత్ర పటానికి పూలు వేసి నివాళులు అర్పించి, వారి ఆత్మకు శాంతి కలగాలని వేడుకున్నారు.అనంతరం వారి కుటుంబాన్ని పరామర్శించి,మనో ధైర్యం నింపి ప్రగడ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ ఛైర్మన్ సంజీవ్,రంగు మహేష్, మండల అధ్యక్షులు పోటు శ్రీధర్ రెడ్డి,గజ్జెల సత్తన్న, వెంకన్న, మురళి, శంకర్ నాయక్, గుండి రవి, శ్యామ్ రావు,గుండి మాజీ సర్పంచ్ జయరాం,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వీక్లీ పరేడ్‌లో పాల్గొన్న జిల్లా ఎస్పీ ఐపీఎస్ డి. జానకి.





**పద్మక్రాంతి, ఆగస్టు 2, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో/ మిడ్జిల్ :**

మహబూబ్ నగర్ జిల్లా పోలీసు కవాతు మైదానంలో వీక్లీ పరేడ్ కు జిల్లా ఎస్పీ డి. జానకి, ఐపీఎస్ హాజరయ్యారు. పరేడ్ ముగిసిన అనంతరం సిబ్బందిని వ్యక్తిగతంగా కలుసుకొని వారి సమస్యలను అడిగి తెలుసుకొని పలు సూచనలు ఇచ్చారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు విధుల్లో ఒత్తిడి, భౌతిక, మానసిక శ్రమ ఎక్కువగా ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలన్నారు. సమయం దొరికినప్పుడల్లా కుటుంబంతో గడిపి ఆత్మీయతను పెంపొందించుకోవాలని సూచించారు. యోగా, మెడిటేషన్ అనునిత్యం చేయడం వల్ల శారీరకంగా, మానసికంగా బలంగా మారవచ్చని తెలిపారు. విధుల్లో నిబద్ధతతో పాటు సేవా దృక్పథాన్ని ప్రదర్శిస్తూ, ప్రజల నమ్మకాన్ని గెలుచుకోవాలన్నారు. పోలీసు కుటుంబం అందరికి అధికారుల మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు. మొబైల్ ఫోరెన్సిక్ వాహనాన్ని జిల్లా ఎస్పీ డి. జానకి ప్రారంభించారు. ఈ పరేడ్ లో అదనపు ఎస్పి ఎన్. బి.రత్నం, ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, ఏఆర్ డిఎస్ పి. శ్రీనివాసులు, కృష్ణయ్య, రవి, నాగేష్, ఇతర పోలీసు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

RNI No : TELTEL/2022/85167
పద్మక్రాంతి
(వాస్తవాలు వెలుగులోకి) తెలుగు దినపత్రిక

బాలాపూర్ జర్నలిస్టు సంతోష్ కు

# అరుదైన గౌరవం.





మహేశ్వరం, ఆగస్టు 2 (పద్మక్రాంతి ప్రతినిధి):

జర్నలిజం వృత్తిలో అంకితభావం, సామాజిక సేవ, అనాధలపై ఆప్యాయత, మూగజీవాలతో మమకారంతో విశేష సేవలు చేపట్టినందున బాలాపూర్ రిపోర్టర్ హెరిఒల్ల సంతోష్ కుమార్ కు ఫ్రెండ్షిప్ మినిస్ట్రీస్ తెలంగాణ ఆధ్వర్యంలో డాక్టరేట్ ఆఫ్ సోషల్ సర్వీస్, ఇందిరా ఆర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యంగ్ ఎంటర్ పీనియర్ నెల్సన్ మండేలా ఎక్సలెన్సీ అవార్డులను అందుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. లాభార్జన లేకుండా సేవే మార్గంగా విశేష సేవలు అందిస్తున్న వారిని గుర్తించి ప్రోత్సాహం అందించడం గర్వకారణం. వారికి మరింత బాధ్యత, సేవ చేయాలని మార్గాన్ని ఈ అవార్డులు రెట్టింపు చేస్తాయన్నారు. గౌరవ డాక్టర్ అవార్డుతో సత్కరించిన ఫ్రెండ్షిప్ మినిస్ట్రీస్ తెలంగాణ నిర్వాహకులు డాక్టర్ పి. వి. పి అంజనీకుమారి, డాక్టర్ అల్లూరి విల్సన్, గౌరవ ముఖ్య అతిథులు ఫిలిం యాక్టర్, (మా అసోసియేషన్ కార్యవర్గ సభ్యుడు డాక్టర్ చింతకుంట మాణిక్ రావు, సీనియర్ జర్నలిస్ట్ హాస్యబ్రహ్మ డాక్టర్ శంకర్ నారాయణ, ఇందిరా ఆర్ట్స్ ఫౌండేషన్ నిర్వాహకురాలు డాక్టర్ ఎన్. ఇందిర లకు సంతోష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## సిపిఐ రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యుడుగా జె. ఆనంద్ గౌడ్

పద్మక్రాంతి ఆగస్టు 02 (రాజేంద్రనగర్, ప్రతినిధి):



సిపిఐ రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యుడుగా జె. ఆనంద్ గౌడ్ రెండోసారి ఎన్నికయ్యారు. శనివారం రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గం మొయినాబాద్ మండల కేంద్రంలోని అంజలి దేవి గార్డెన్ లో సిపిఐ రంగారెడ్డి జిల్లా 17వ మహా సభలు విజయవంతం అయ్యాయి. మహాసభల్లో సిపిఐ రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యులుగా రెండోసారి రాజేంద్రనగర్ నియోజకవర్గం జిహెచ్ఎంసి రాజేంద్రనగర్ పరిధిలోని మైలార్దేవ్ పల్లికి చెందిన జె. సదానంద గౌడ్ మాట్లాడుతూ.... తనపై నమ్మకం నుంచి సిపిఐ కౌన్సిల్ సభ్యులుగా రెండోసారి అవకాశం కల్పించిన సిపిఐ జిల్లా కౌన్సిల్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. పేద బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం నిరంతరం పోరాడుతున్న ఎర్రజెండా ఆధ్వర్యంలో రాబోయే రోజుల్లో ప్రజా సమస్యల పరిష్కారం జరిగే పోరాటాల్లో ధనవంతు కృషి చేస్తానన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సిపిఐ ఎర్రజెండా పార్టీ ఇచ్చే పిలుపులు అన్నింటిలో పాల్గొంటూ ప్రజా సమస్యల పరిష్కారం పాటు పడతానన్నారు.

# రా చెరువు పరిరక్షణలో విశేష కృషి చేసిన "డా.లక్ష్మి వీరమల్లు"

- "రా చెరువు" సుందరీకరణ అభినందనీయం
- డాక్టర్ లక్ష్మి వీరమల్లును సన్మానించిన శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయ కమిటీ

మేడిపల్లి,ఆగస్టు 02,పద్మక్రాంతి:



బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రాచెరువు వద్ద శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయం నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన సామాజిక కార్యకర్త,రా చెరువు పరిరక్షణ సమితి సభ్యులు డా.లక్ష్మీ వీరమల్లు ను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీ వీరమల్లు మాట్లాడుతూ త్వరలోనే పూర్తి స్థాయిలో ఆలయం నిర్మాణం జరగాలని ఆకాంక్షించారు.ఎన్నో ఏళ్లుగా రాచెరువు పరిరక్షణ కోసం మల్లయ్య నగర్ మిత్రులతో,ఇతర కాలనీల సభ్యులతో కలిసి అనేక సంవత్సరాలుగా ప్రజా ప్రతినిధులు, అధికారులు,వివిధ పార్టీల నాయకులు,స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు,వివిధ



కుల సంఘాల నేతలు,మీడియా ప్రతినిధులతో అనేక సమావేశాలు నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు రా చెరువు పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేశామని,వారందరికీ పేరుపేరునా ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు.ముఖ్యంగా మాజీ మేయర్ అజయ్ కుమార్ చొరవతో హెచ్ఎండిఏ నిధులతో రా చెరువు సుందరీకరణ పనులు వేగంగా జరగడం,ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో "పెద్దమ్మ తల్లి"ఆలయం నిర్మాణం పురుడు పోసుకుని భోనాలు,హోమం,అంగరంగ వైభవంగా నిర్వహించడం సంతోషకరమని డా.లక్ష్మీ వీరమల్లు అన్నారు.



# ప్రతి ఒక్కరు విధిగా "మొక్కలు" నాటాలి

## 4వ డివిజన్లో మొక్కలు నాటిన మాజీ డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్

మేడిపల్లి,ఆగస్టు 03,పద్మక్రాంతి:

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 100 రోజుల ప్రత్యేక ప్రణాళిక కార్యక్రమంలో హరిత తెలంగాణ లక్ష్యంగా బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ 4వ డివిజన్ పరిధిలో శ్రీ లక్ష్మీ నగర్ కాలనీ పార్కులో బోడుప్పల్ మాజీ డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మున్సిపల్ కమిషనర్ శైలజ పాల్గొని మొక్కలు నాటారు.

ఈ సందర్భంగా కొత్త స్రవంతి కిషోర్ గౌడ్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరు బాధ్యతగా భావించి మొక్కలను విరివిగా నాటాలని,అదే మన భావితరాలకు మనమిచ్చే గొప్ప బహుమతి అని అన్నారు ఈ కార్యక్రమంలో శ్రీ లక్ష్మీ నగర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు ఆసర్ల బీరప్ప,కాలనీ అసోసియేషన్ సభ్యులు,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కలిసిన మణికొండ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ కస్తూరి నరేందర్



పద్మక్రాంతి ఆగస్టు 02 (రాజేంద్రనగర్, ప్రతినిధి):

లాంకో హిల్స్ కొత్త రోడ్డు నుండి పుప్పాల గూడ లక్ష్మీనరసింహస్వామి సర్కిల్ రోడ్డు వరకు కొత్త రోడ్డు మంజూరు గురించి తెలంగాణ రోడ్లు భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని మణికొండ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ కస్తూరి నరేందర్ కలిశారు.మణికొండ మున్సిపాలిటీ పరిధిలో ఇరుకు రోడ్లతో ప్రజలు నిత్యం ట్రాఫిక్ సమస్యలను ఎదుర్కొంటున్నారని కస్తూరి నరేందర్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జితేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కిరణ్ కుమార్ మాజీ కౌన్సిలర్ లక్ష్మీనారాయణలతో కలిసి మంత్రి కోమటిరెడ్డి వెంకట్రెడ్డినీ కలిసి వినతి పత్రం అందజేశారు. మణికొండ మున్సిపాలిటీలో ఇరుకు రోడ్లు ఉండడం వలన రోజురోజుకు ప్రమాదాలు ఎక్కువ అవుతున్నాయని ఈ ప్రమాదాల జరగకుండా లింక్ రోడ్ల విస్తరణ మరియు నూతన రోడ్డు నిర్మాణాల, లాంకో హిల్స్ కొత్త రోడ్డునుండి పుప్పాలగూడ లక్ష్మీనరసింహస్వామి స్వామల దేవాలయం సర్కిల్ వద్దకు పుప్పాలగూడ ప్రభుత్వ భూమి నుండి నూతన రోడ్డు నిర్మాణం పనులకు ప్రభుత్వ భూమిని కేటాయించాలని రోడ్డు నిర్మాణం పనులను త్వరగా చేపట్టేందుకు అధికారులను ఆదేశించాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కస్తూరి నరేందర్ మాట్లాడుతూ..... కోమటిరెడ్డి వెంకటరెడ్డి రోడ్ల సమస్యల పరిష్కారంకై సానుకూలంగా స్పందించారని అన్నారు.ఈ కార్యక్రమంలో , మాజీ కో ఆప్షన్ సభ్యులు అహ్మద్ షా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# కొల్లాపూర్ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన భట్టి విక్రమార్క.





పద్మక్రాంతి, ఆగస్టు 2, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో/ మిడ్జిల్ :

కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలోని రాజుగారి బంగ్లా ప్రాంగణంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా హాజరై కొల్లాపూర్ నియోజకవర్గంలో ఆరు 33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి, పానగల్ లో నూతనంగా ఏర్పాటు చేయనున్న 220/132 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణాలకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా నాగర్ కర్నూల్ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని పదవతరగతి విద్యార్థులకు పంపిణీ చేయడానికి తయారు చేసిన డిజిటల్ కంటెంట్ స్టడీ మెటీరియల్స్ ను నాగర్ కర్నూల్ ఎంపి, ఎమ్మెల్యేలతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఉపముఖ్యమంత్రి లబ్దిదారులకు నూతన రేషన్ కార్డులను, కళ్యాణ లక్ష్మి, షాధిముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర ప్రోహిబీషన్ అండ్ ఆబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, నాగర్ కర్నూల్ ఎంపి డాక్టర్ మల్లు రవి, మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి , నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే డా.సి. వంశీకృష్ణ, వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, డిసిసిబి చైర్మన్ విష్ణు వర్ధన్ రెడ్డి, గద్వాల మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ సరిత తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ఎండగడుతూ బిజెపి ఓబీసీ మోర్చా "మహా ధర్నా"

### మహాధర్నాలో పాల్గొన్న పీర్జాదిగూడ వెస్ట్ బిజెపి శ్రేణులు






మేడిపల్లి,ఆగస్టు 02,పద్మక్రాంతి:

తెలంగాణ రాష్ట్రంలో 18 నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరును ఎండగడుతూ,బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ,తెలంగాణ రాష్ట్ర ఓబిసి మోర్చా ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద మహాధర్నా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర బిజెపి నేతలు అందరూ పాల్గొన్న ఈ ధర్నా కార్యక్రమానికి పీర్జాదిగూడ వెస్ట్ బిజెపి అధ్యక్షుడు రాంపల్లి యాదగిరి గౌడ్ ఆధ్వర్యంలో బిజెపి నాయకులు భారీగా మహా ధర్నాలో పాల్గొన్నారు.

# వస్పుల ఉన్నత పాఠశాల విద్యాప్రగతికి కొత్త అధ్యాయం.

- ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రానికి భూమి పూజ.
- అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఎంపీ అరుణ, ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి.

పద్మక్రాంతి, ఆగస్టు 2, మిడ్జిల్ :

మిడ్జిల్ మండలంలోని వస్పుల ఉన్నత పాఠశాల అధునాతన సైన్స్ ల్యాబ్, అదనపు తరగతి గది నిర్మాణానికి పీఎం నిధుల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించిన మద్దతుతో శనివారం మహబూబ్‌నగర్ ఎంపి. డీకే అరుణ, జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డిలు కలిసి ప్రారంభం చేశారు.

ఈ సందర్భంగా ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ.. పీఎం నిధుల నుంచి 27 లక్షలతో నిర్మించిన తరగతి గదులు, సైన్స్ ల్యాబ్ ను ప్రారంభించేసుకున్నామని చెప్పారు.

అనంతరం ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రానికి భూమి పూజ చేశారు. ప్రతి గ్రామంలోనూ విద్యా వసతులు మరింత బలపడేలా, కేంద్రం అన్ని విధాలుగా మద్దతు ఇస్తోందని తెలిపారు.

ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి మాట్లాడుతూ.. జడ్చర్ల నియోజకవర్గంలోని ప్రతి పాఠశాలలను అన్ని సదుపాయాలతో అభివృద్ధి చేయడం మా కర్తవ్యమని పేర్కొన్నారు. ఈ పాఠశాలకు 27 లక్షల నిధులు మంజూరు చేసినందుకు ఎంపీ కి ధన్యవాదాలు తెలిపారు. ఎంపీ గారిది, నాది పార్టీలు వేరైనా మా సంకల్పం విద్యాభివృద్ధి అని స్పష్టం చేశారు. గత రెండు రోజుల క్రితం ఎంపీ అరుణమ్మతో కలిసి జడ్చర్లకు బైపాస్ మంజూరు చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గట్కరి ని కోరామని ప్రస్తావించారు. ఉపాధ్యాయులు అడిగినట్లుగా పాఠశాలకి డైనింగ్ హాల్, వంటగదికి నిధులు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే చెప్పారు. ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థులు అందరూ బాగా చదివి పదవ తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని అయన కోరారు. ఈ కార్యక్రమంలో బాదేపల్లి చైర్ పర్సన్ తంగేళ్ల జ్యోతి, స్థానిక ఎమ్మార్వో రాజు యూపీ, ఎంపీడీవో గీతాంజలి, ఎంఈఓ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు,వివిధ పార్టీల నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.





### ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలి.

మిడ్జిల్ మండలంలోని వస్పుల గ్రామంలో అదనపు గదుల ప్రారంభానికి హాజరైన ఎంపీ, ఎమ్మెల్యేకు ఉపాధ్యాయులు విద్యార్థులతో వెట్టిచాకిరీ చేయిస్తున్నారని తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. విద్యార్థులు చదువుకోవడానికి వస్తున్నారా లేక చాకిరి చేయడానికి వస్తున్నారా అని తల్లిదండ్రులు ఆసహనం వ్యక్తం చేశారు. విద్యార్థులతో వెట్టిచాకి చేయుస్తున్న ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు.

## పహాడిషరీఫ్ సీఐ రాఘవేందర్ రెడ్డిని కలిసిన మంఖాల్ కాంగ్రెస్ నాయకులు.



మహేశ్వరం, ఆగస్టు 2, (పద్మక్రాంతి ప్రతినిధి):

నూతనంగా వచ్చిన పహాడిషరీఫ్ సీఐ రాఘవేందర్ రెడ్డిని తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని మంఖాల్ గ్రామ కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. సన్మానించిన వారిలో తుక్కుగూడ మున్సిపాలిటీ మంఖాల్ గ్రామ కాంగ్రెస్ నాయకులు మహేశ్వరం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్. శివగళ్ళ యాదయ్య, మాజీ ఉప్పసర్పంచ్ కప్పల సుందరయ్య, తుక్కుగూడ మున్సిపాలిటి ఎస్సీ సెల్ అధ్యక్షుడు కప్పల రాజు, బరిగల నర్సింహా, ఇందిరమ్మ కమిటీ అధ్యక్షులు కామొల్ల మహేష్, బాకీ సాల్మన్, సబావత్ రాజు, 8వ వార్డు కాంగ్రెస్ అధ్యక్షుడు తొండిపల్లి గిరి, బాకీ రాజ్ కుమార్ ఉన్నారు.

RNI No : TELTEL/2022/85167
పద్మక్రాంతి
(వాస్తవాలు వెలుగులోకి) తెలుగు దినపత్రిక

# ఉదండాపూర్ నిర్వాసితులతో సహపంక్తి భోజనం చేస్తా..

- మీడియా సమావేశంలో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి.



**పద్మక్రాంతి, ఆగస్టు 2,ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో/ మిడ్జిల్,:**

డిసెంబర్ 9 తేదీన ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ మొత్తాలను బాధిత కుటుంబాలకు చెల్లించడం జరుగుతుందని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి ప్రకటించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అనిరుధ్ రెడ్డి మాట్లాడారు. ఆదివారం ఉదండాపూర్ నిర్వాసితులందరికీ భోజనాలు పెట్టి ఈ విషయాన్ని చెబుతామని చెప్పారు. తమ హయాంలో ఉదండాపూర్ ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద ఇప్పటి వరకూ రూ.250 కోట్లు మంజూరు కావడం జరిగిందని వివరించారు.

వల్లూరు గ్రామం, తాండాలకు చెందిన ప్రజలు అధికారులకు సహకరించడంతో వారి గ్రామాలకు అవార్డు పాసైయిందని, వారి ఖాతాల్లో ప్రభుత్వం డబ్బులను కూడా జమ చేసిందని చెప్పారు. అయితే ఉదండాపూర్ లో మాత్రం కొంత మంది రాజకీయాలు చేస్తూ ప్యాకేజీపై అభ్యంతరాలు పెడుతూ ఉన్న కారణంగా ఇప్పటి వరకూ అవార్డు కూడా పాస్ కాలేదన్నారు.

## అంబేద్కర్ కళాభవన ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలి.

**ఎమ్మెల్యేకు వినితి పత్రం అందజేసిన అంబేద్కర్ సంఘం నాయకులు.**



**పద్మక్రాంతి, ఆగస్టు 2, మిడ్జిల్ :**

మిడ్జిల్ మండలం కేంద్రంలో అంబేద్కర్ కళాభవన ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి కి అంబేద్కర్ సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం అధ్యక్షులు దేవయ్య, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, సంఘం సీనియర్ నాయకులు బరిగెల వెంకటయ్య, బాలు ,రమేష్ ,సురేష్, గౌస్, అశోక్, నరసింహ తదితరులు ఉన్నారు.

## సంపూర్ణత అభియాన్ లో కొమరం భీమ్ జిల్లా అత్యుత్తమం.

**కొమరం భీమ్ ఆసిఫాబాద్, ఆగస్టు 2,(పద్మక్రాంతి ప్రతినిధి ):**



ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన సంపూర్ణత అభియాన్ కార్యక్రమం నిర్వహణలో కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా అత్యుత్తమంగా నిలిచింది. శనివారం రాష్ట్ర రాజధాని హైదరాబాదులోని రాజ్ భవన్ లో గల దర్బార్ మందిరంలో సంపూర్ణత అభియాన్ లో అత్యుత్తమ సేవలు అందించిన కొమరం ఆసిఫాబాద్ జిల్లా తరపున జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే రాష్ట్ర గవర్నర్ జిష్ణు వర్మ చేతుల మీదగా పురస్కారం అందుకున్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి.

**మహేశ్వరం, ఆగస్టు 2 (పద్మక్రాంతి ప్రతినిధి)**



మహేశ్వరం పోలీస్ స్టేషన్ పరిధిలోని సిరిగిరిపురం అర్బన్ ఫారెస్ట్ సమీపంలో రోడ్డు ప్రమాదంలో సిరిగిరిపురం గ్రామానికి చెందిన యువకుడు తడకల బాలకృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బాలకృష్ణ తన ఫ్యాషన్ ప్లస్ బైక్ పై తుక్కుగూడ వెళ్లి తిరిగి వస్తుండగా మార్గ మధ్యలో సిరిగిరిపురం అర్బన్ ఫారెస్ట్ సమీపంలో కుక్క అడ్డు రావడంతో తప్పించబోయి ప్రమాదానికి గురయ్యాడు. దీంతో అదుపుతప్పి తలకి తీవ్ర గాయం కావడంతో తీవ్ర రక్త స్రావం వలన అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.



# బసవతారకం ఆస్పత్రికి 13న శంకుస్థాపన

- ఏర్పాట్లను పరిశీలించిన బాలకృష్ణ

**అమరావతి,ఆగస్ట్2(పద్మక్రాంతి):**

అమరావతిలో ఈ నెల 13న బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రికి ముఖ్యమంత్రి చంద్రబాబు భూమిపూజ చేయనున్నారు. ఈ సందర్భంగా ఏర్పాట్లను బాలకృష్ణ, ఆయన సన్నిహితులు గాంధీ, సిద్ధాంతి నాగమల్లేశ్వరరావు శనివారం పరిశీలించారు. ఆస్పత్రి నిర్మాణ ప్లాన్‌లను సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ ప్రవీణ్.. బాలకృష్ణకు వివరించారు. మొత్తం 21 ఎకరాల విస్తీర్ణంలో క్యాన్సర్ ఆస్పత్రి నిర్మిస్తున్నట్లు చెప్పారు. మూడు దశల్లో ఆస్పత్రి నిర్మాణం ఉంటుందన్నారు. ఇకపై తాను తీయబోయే సినిమాలలో సమాజానికి సంబంధించిన మంచి సందేశాలు ఉంటాయని బాలకృష్ణ తెలిపారు. హిందూపురంలో పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలకు త్వరలో శ్రీకారం చుట్టనున్నట్లు- చెప్పారు. భారీ ఎత్తున పరిశ్రమలు, అంతర్‌రాష్ట్ర రహదారుల నిర్మాణం చేపడుతున్నట్టు- చెప్పారు.మహిళా సాధికారత ఆధారంగా తీసిన 'భగవంత్ కేసరి' సినిమాకు జాతీయ అవార్డు రావడం సంతోషంగా ఉందని ప్రముఖ నటు-డు నందమూరి బాలకృష్ణ అన్నారు.

# గనిలో సైడ్ ఫాల్ కూలి కార్మికుడు మృతి





**రామకృష్ణాపూర్ ఆగస్టు 2( పద్మక్రాంతి):**

మంచిర్యాల జిల్లా మందమర్రి ఏరియా కేకే5 గనిలో శుక్రవారం రాత్రి సెకండ్ షిఫ్ట్ లో జనరల్ అసిస్టెంట్, యాక్టింగ్ ఎస్ డి ఎల్ ఆపరేటర్ గా విధులు నిర్వహిస్తున్న రామకృష్ణాపూర్ పట్టణానికి చెందిన రాసపల్లి శ్రావణ్ కుమార్ గనిలో సైడ్ ఫాల్ కూలి బొగ్గు అతనిపై పడి తీవ్ర గాయాల పాలయ్యాడు. వెంటనే అతనితో ఉన్న తోటి కార్మికులు హుటాహుటిన రామకృష్ణాపూర్ పట్టణంలోని సింగరేణి ఏరియా హాస్పిటల్ కి తరలించారు. వైద్యులు అతని ఆరోగ్య పరిస్థితి బాగాలేదని మెరుగైన చికిత్స కొరకు కరీంనగర్ లోని ఆస్పత్రికి తరలించగా మార్గం మధ్యలోనే మృతి చెందినట్లు అక్కడి వైద్యులు తెలిపారు. ఈ విషయమై అధికారుల నిర్లక్ష్యం వల్లనే ఆ సింగరేణి కార్మికుడు మృతి చెందాడని పలు యూనియన్ నాయకులు మండిపడ్డారు. కార్మికులకు భద్రత కల్పించడం పట్ల అధికారులు పూర్తిగా వ్యవహరించడం లేదని ఆరోపించారు.

మృతుడు శ్రావణ్ కుమార్ భౌతికకాయాన్ని శనివారం కార్మిక మైనింగ్ శాఖ మంత్రి వివేక్ రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రిలో సందర్శించి నివాళులర్పించి, మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటానని భరోసా అందించారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ మృతుని కుటుంబానికి కోటి రూ-పాయల ఎక్స్ గ్రేషియో తో పాటు సింగరేణి సంస్థ నుంచి అన్ని లాభాలు వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చారు. కేకే5 గనిలో జరిగిన ప్రమాదం తీరును సందర్శించి గని లోపల రక్షణ ఏర్పాట్లను కార్మికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మందమర్రి జిఎం దేవేందర్ తో మాట్లాడుతూ కార్మికులు రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని, అధికారులకు ఆదేశాలు సింగరేణి సంస్థకు లాభాలే కాకుండా సింగరేణి కార్మికుల ప్రాణాలే ముఖ్యమని తెలిపారు. త్వరలో సీఎం రేవంత్ రెడ్డి సింగరేణి అధికారులతో కార్మికుల సమస్యలపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామని ఆయన అన్నారు.

మృతుడు శ్రావణ్ కుమార్ (32) గనిలో మృతి చెందడం చాలా బాధాకరమని, పూర్తిస్థాయిలో కార్మికుల భద్రతను గాలికి వదిలేసినటువంటి సింగరేణి యాజమాన్యమే పూర్తి బాధ్యత అని



చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆరోపించారు. శనివారం ఏరియాస్పత్రిలోని మృతుడి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కేవలం బొగ్గు ఉత్పత్తి అధిగమించాలని, కేవలం లాభాలను ఆర్జించాలనే ఆలోచన తప్ప కార్మికుల భద్రతకు పెద్దపీట వే-యకుండా సింగరేణి యాజమాన్యం వ్యవహరిస్తుందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ 20 నెలలు పరిపాలనలో కోల్డ్ బెల్ట్ ఏరియాలో చాలా సంఘటనలు జరిగాయని, ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం, ఈ ప్రభుత్వం కార్మికుల బాధ్యతకు పెద్దపీట వేయాలని ఆరోపించారు.అదేవిధంగా పట్టణంలోని వివిధ పార్టీ నాయకులు, కార్మిక సంఘాలు సంతాపం వ్యక్తం చేశారు.

# స్వతంత్ర ఉద్యమం నుంచి కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులు.

**సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.జయలక్ష్మి.**

**పద్మక్రాంతి, ఆగస్టు 02, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో/ మిడ్జిల్ :**




దేశంలో స్వతంత్ర ఉద్యమంలో కార్మికులు ముందు భాగాన నిలబడి పోరాటాలద్వారా హక్కులు సాధించుకున్నారని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.జయలక్ష్మి తెలిపారు. జడ్చర్ల పట్టణంలోని అంబేద్కర్ కళాభవంలో శిక్షణ తరగతులను సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.జయలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కార్మిక ఉద్యమ చరిత్ర సిఐటియు విశిష్టత అనే అంశంపై బోధించారు. స్వతంత్రం వచ్చిన తర్వాత కార్మికులు తమ కనీస వేతనాల కోసం ఉపాధి భద్రత కోసం పోరాడే అనేక హక్కులను సాధించుకోవడం జరిగింది, పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను చట్టాలను నేడు అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాలను మార్చి నాలుగు లేబర్ కోడ్ లను తీసుకుని వచ్చి కార్మికులు పోరాటం చేసి సాధించుకున్న హక్కులను చట్టాలను పూర్తిగా పెట్టుబడిదారులకు, యాజమాన్యాలకు తాకట్టు పెట్టేసిందన్నారు. భవిష్యత్తులో కార్మికులు బానిసత్వంలోకి నెట్టబడి యజమానులు చెప్పిందే వేదం గా పనిచేయాల్సిన పరిస్థితిని బిజెపి ప్రభుత్వం తీసుకొస్తుందన్నారు.

కార్మిక కోడ్లను రద్దుచేసి కార్మిక చట్టాలను, వారి హక్కులను యధావిధిగా అమలు చేయాలని, కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర నాయకులు కిల్లె గోపాల్, సిఐటియు జిల్లా అధ్యక్షులు దిప్లా నాయక్, జిల్లా కార్యదర్శి కురుమూర్తి, సిఐటి జిల్లా సహాయ కార్యదర్శి సత్తయ్య, జిల్లా కోశాధికారి చంద్రకాంత్, రాజ్ కుమార్, తిరుమలయ్య, వాసియాబేగం, కమరలి, అంగన్వాడి, ఆశ, గ్రామపంచాయతీ, మున్సిపల్, మధ్యాహ్నం భోజనం, వివో ఏలు సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

# మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో రైతు కమిషన్ భేటీ



## చెరువులు, కుంటల పరిరక్షణపై చర్చించిన కమిషన్.

## రైతు కమిషన్ ఆధ్వర్యంలో త్వరలో సమావేశం ఏర్పాటు

## సమావేశానికి హాజరుకావాలని మంత్రిని కోరిన కమిషన్

## సమగ్ర పాలసీ తోనే చెరువులు, కుంటల అభివృద్ధి: ఉత్తమ్

**హైదరాబాద్,ఆగస్ట్2(పద్మక్రాంతి):**

రాష్ట్ర సచివాలయంలో ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో రైతు కమిషన్ భేటీ-అయ్యింది. ఈ భేటీ-లో కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు రాములు నాయక్, గడుగు గంగాధర్, భవానీ రెడ్డి వున్నారు. ఇప్పటి వరకు రైతు కమిషన్ చేసిన కార్యక్రమాలను వివరించడంతో పాటు- రాష్ట్రంలో చెరువులు, కుంటల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలపై మంత్రికి కమిషన్ సూచనలు చేసింది. మైనర్ ఇరిగేషన్ కింద ఉన్న చెరువులు, కుంటల పరిరక్షణకు వెంటనే నీటి నిర్వహణ కమిటీ-లను ఏర్పాటు- చేయాలనీ చెప్పింది. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో కూడా నీటి సంఘాలు వున్న అంశాన్ని గుర్తుచేసింది. గ్రామీణ స్థాయిలో రైతులు సంఘటితమై చెరువులను కాపాడుకునే వారని, ఐతే గత పదేండ్ల కాలంలో రాష్ట్రంలో ఉన్న చెరువులు కుంటలు అన్యాక్రాంతమయ్యాయని వివరించింది. కొన్ని చోట్ల కబ్జాదారులు ఆక్రమించి లే ఔట్లు- వేయడం, వాటర్ బాడీస్ కు వచ్చే క్యాచ్ మెంట్ ఏరియాల్లో భారీగా కాల్వలు దెబ్బతినడం, మాయమవడం జరిగాయని వివరించింది. ఐతే ప్రధానంగా చెరువులు కుచించుకపోవడం, గ్రౌండ్ వాటర్ లెవల్స్ పడిపోవడం జరిగిందని వివరించింది. రాష్ట్రంలో చెరువులు కాపాడుకుపడానికి సమగ్రమైన పాలసీ ఉండాలని రైతు కమిషన్ తెలిపింది. ఆ పాలసీని కమిషన్ తయారు చేయనున్నట్లు- వివరించింది. నిపుణులతో పాలసీ కి సంబంధించి ప్రసెంటేషన్ మీటింగ్ త్వరలో కమిషన్ ఏర్పాటు- చేయనున్నట్లు-.. ఆ సమావేశానికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హాజరుకావాలని కమిషన్ కోరింది. కమిషన్ ఆహ్వానం కు మంత్రి ఉత్తమ్ సానుకూలంగా స్పందించినట్లు- కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

## నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసిన మాజీ ఎమ్మెల్యే జయపాల్ యాదవ్...



**పద్మక్రాంతి, ఆగస్టు 2, (కల్వకుర్తి ప్రతినిధి):**

కల్వకుర్తి మండలంలోని జంగారెడ్డిపల్లి గ్రామం నికి చెందిన.కొలకులపల్లి కృష్ణయ్య అనారోగ్యం తో మృతి చెందినాడు వారి కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్. గ్రామానికి చెందిన %ఎతీం% పార్టీ నాయకుల ద్వారా 5000 రూపాయలు ఆర్థిక సాయం అందించడం జరిగింది ఈ కార్యక్రమం లో %ఎతీం% నాయకులు భన్నె శ్రీధర్. ఆంజనేయులు. లింగం.సౌడంపల్లి రాములు. నరమళ్ళ యాదయ్య. తదితరులు పాల్గొన్నారు.

## గొర్రెలకు మేకలకు మందులు వేయించాలి



**పద్మక్రాంతి, ఆగస్టు 2,(ఇబ్రహీంపట్నం ప్రతినిధి):**

గొర్రెలు, మేకల పెంపకం దారులు తమ జీవాలకు నట్టల నివారణ మందును తప్పకుండా వేయించాలని టీపీపీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్తకూర్మ మంగమ్మ శివకుమార్ అన్నారు.

శనివారం తుర్కయంజాల్ లో పశువైద్య పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో గొర్రెలు, మేకలకు నట్టల మందులు పంపిణీ చేసి మాట్లాడారు. జీవాలకు వ్యాధి సోకిన తర్వాత కాకుండా, ముందే పశు వైద్యాధికారుల సలహాలు, సూచనలు పాటించి నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం అధ్యక్షుడువాస్పరి.బాబయ్య,ప్రధాన కార్యదర్శి గుండ.నర్సింహ ,కురుమ సంఘం డైరెక్టర్,మాజీ కౌన్సిలర్,కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షురాలు, కొత్తకూర్మ.మంగమ్మ, వెటర్నరీ డాక్టర్ శిల్పారెడ్డి ,మాజీ అధ్యక్షుడుగుండ. లింగమయ్య, తుర్కయంజాల్ బీజేపీ పార్టీ ఉప అధ్యక్షుడు గుండ.కృష్ణ, బండారి.మల్లయ్య,గుండ. అనిల్,గుండ.ప్రవీణ్, లోకేష్,శ్రీశైలం,ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

RNI No : TELTEL/2022/85167
పద్మక్రాంతి
తెలుగు దినపత్రిక




## ఓజీ నుంచి పవర్‌ఫుల్ సాంగ్ విడుదల

టాలీవుడ్ హీరో పవన్ కల్యాణ్ నటిస్తోన్న తాజా చిత్రం 'ఓజీ'. 'సాహో' ఫేం సుజీత్ దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రం సెప్టెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. జపాన్ బ్యాక్‌డ్రాప్‌లో గ్యాంగ్‌స్టర్ కథాంశంతో ఈ సినిమా సిద్ధమవుతుండగా.. ఇప్పటికే వచ్చిన ఫస్ట్ లుక్‌తో పాటు గ్లింప్స్ అభిమానులను అలరించాయి ఇదిలావుంటే తాజాగా ఈ మూవీ నుంచి పవర్‌ఫుల్ సాంగ్ ఓజీ ఫైర్ స్టోర్మ్ ని విడుదల చేశారు మేకర్స్. థమన్ సంగీతం అందించిన ఈ పాటకు థమన్ ఎస్ , నజీరుద్దీన్ భరతరాజ్ , సిలంబరసన్ టీఆర్ (శింబు) , దీపక్ బ్లూ, రాజా కుమారి కలిసి పాడారు.




## నా రాముడు ఎప్పటికీ రామ్‌చరణే

### మహావతార్ నరసింహ డైరెక్టర్ అశ్విని కుమార్



హోంబలే ఫిల్మ్స్ బ్యానర్‌పై మహావతార్ సినెమాటిక్ యూనివర్స్నుంచి వచ్చిన తొలి మైథలాజికల్ యానిమేటెడ్ ఫీచర్ ఫిల్మ్ 'మహావతార్ నరసింహ' బాక్సాఫీస్ వద్ద హవా కొనసాగిస్తోంది. విడుదలైనప్పటి నుంచే అద్భుత రెస్పాన్స్ దక్కించుకున్న ఈ చిత్రం రెండో వీకెండ్‌లో మరింత కలెక్షన్స్ రాబడుతుంది. అడ్వాన్స్ బుకింగ్స్ పెద్ద ఎత్తున నమోదవుతుండటంతో, సినిమా హాళ్ల వద్ద సందడి నెలకొంది. ఈ విజయం నేపథ్యంలో దర్శకుడు అశ్విన్ కుమార్ కూడా చిత్రానికి మరింత బజ్ తీసుకొచ్చే భాగంగా పోస్ట్-రిలీజ్ ప్రమోషన్లలో పాల్గొంటున్నారు. ఇకపోతే, తాజాగా జరిగిన ఓ ఇంటర్వ్యూలో డైరెక్టర్ అశ్విన్ కుమార్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఒకవేళ ఈ ఫ్రాంచైజీలో లైవ్ యాక్షన్ ఫిల్మ్ తీసే అవకాశం వస్తే.. అందులో శ్రీరాముడిగా ఎవరిని తీసుకుంటారనే ప్రశ్నకు ఆయన నేరుగా రామ్‌చరణ్ పేరును చెప్పుకొచ్చాడు. నిజానికి సోషల్ మీడియాలో ఇప్పటికే రామ్‌చరణ్‌కి శ్రీరాముడి పాత్రకు భారీ డిమాండ్ ఉంది. డైరెక్టర్ అశ్విన్ కుమార్ తాజాగా చేసిన వ్యాఖ్యలు వాటికి మరింత అతన్ని ఇచ్చాయి. అయితే, దీనికి కారణం లేకపోలేదు.. ముఖ్యంగా ట్రిపుల్ ఆర్ చిత్రంలో అల్లూరి సీతారామరాజుగా రామ్‌చరణ్ చేసిన క్లైమాక్స్ విజువల్స్ చూసిన తర్వాత, అభిమానులు చరణ్ అచ్చం శ్రీరాముడిలా కనిపించారని అనేకమంది అభిప్రాయపడ్డారు. ఉత్తర భారతదేశంలోని ప్రేక్షకులలో కూడా ఈ పాత్రకు రామ్‌చరణ్‌ను మరింత దగ్గరగా అనిపించారని భావిస్తున్నారు. ఇప్పటికే మహావతార్ సినెమాటిక్ యూనివర్స్‌కు పునాది పడిపోయిన నేపథ్యంలో.. రాబోయే కాలంలో ఇందులో లైవ్ యాక్షన్ ప్రాజెక్ట్ కూడా రానున్నాయన్న అంచనాలు ఉన్నాయి.

## రెండోభాగం మరింత ఆసక్తిగా ఉంటుంది

### కింగ్డమ్ సీరియల్‌పై విజయ్ దేవరకొండ



విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటించిన 'కింగ్‌డమ్' చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తూ భారీ వసూళ్లను రాబడుతోంది. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో సత్యదేవ్, భాగ్యశ్రీ బోర్సే, వెంకటేష్ ముఖ్య పాత్రలు పోషించారు. భారీ అంచనాల నడుమ జూలై 31వ తేదీన విడుదలైన 'కింగ్‌డమ్' చిత్రం.. విమర్శకుల ప్రశంసలతో పాటు-, ప్రేక్షకులను మెప్పు పొందుతోంది. అన్నదమ్ముల అనుబంధం నేపథ్యంలో గ్యాంగ్ స్టర్ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమా.. వెండితెరపై ఓ కొత్త అనుభూతిని కలిగిస్తోందని, విజువల్ గా అద్భుతంగా ఉందని చూసిన ప్రతి ఒక్కరూ చెబుతున్నారు. 'కింగ్‌డమ్' చిత్రానికి ప్రేక్షకుల నుంచి వస్తున్న విశేష స్పందన నేపథ్యంలో.. తాజాగా పాత్రికేయులతో ముచ్చటించిన విజయ్ దేవరకొండ, పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. కేవలం తెలుగు రాష్ట్రాలలో మాత్రమే కాకుండా.. ఇతర రాష్ట్రాల్లో, ఓవర్సీస్ లో విశేష స్పందన లభిస్తుంది. ముఖ్యంగా మలయాళంలో ఈ స్థాయి స్పందన ఊహించలేదు. మలయాళ వెర్షన్ విడుదల చేయకపోయినా.. అక్కడి ప్రేక్షకులు ఇంతటి ప్రేమ చూపించడం చాలా ఆనందంగా ఉందని విజయ్ అన్నారు. కెరీర్ ప్రారంభంలో సినిమా హిట్ అయితే సెలెబ్రేట్ చేసుకోవాలనే ఆలోచన ఉండదు. ఎందుకంటే ఒక సినిమా హిట్ అయితే ఇంకో సినిమా చేసే అవకాశం వస్తుందని ఆశ ఉంటుంది. పెళ్లి చూపులు హిట్ అయినప్పుడు.. ఇంకొన్ని అవకాశాలు వస్తాయని ఆనందపడ్డాను. కానీ, ఇప్పుడు అలా కాదు. సినిమా హిట్ అయితే ఆనందం కంటే కూడా మరిన్ని మంచి సినిమాలు చేయాలనే బాధ్యత ఎక్కువగా ఉంటుంది. ప్రతి ఒక్కరికీ సినిమా విడుదలకు ముందు ఎంతో కొంత ఒత్తిడి ఉంటుంది. కింగ్‌డమ్ విడుదలకు ముందు మాక్కూడా అలాంటి ఒత్తిడి ఉంది. ఎప్పుడైతే మొదటి షో పూర్తయ్యి, పాజిటివ్ వచ్చిందో.. అప్పుడు చాలా సంతోషం కలిగిందన్నారు. గౌతమ్ కుటుంబ బంధాలను, ఎమోషన్స్ ని డీల్ చేసే విధానం నాకు ఇష్టం. అన్నదమ్ముల అనుబంధం నేపథ్యంలో గ్యాంగ్ స్టర్ డ్రామా అనే ఐడియా గౌతమ్ చెప్పినప్పుడు నాకు చాలా ఆసక్తికరంగా అనిపించింది. జెర్సీ లాంటి ఎమోషనల్ జర్నీలో కూడా మనకు హై ఇచ్చే మూమెంట్స్ ఉంటాయి. గౌతమ్ కి ప్రతి విషయం మీద పట్టు- ఉంటుంది. హీరో పాత్ర, షాట్ కంపోజిషన్, మ్యూజిక్ ఇలా ప్రతిదాని మీద ఎంతో శ్రద్ధ తీసుకుంటాడు. కింగ్‌డమ్ కోసం ఆసక్తికర కథనం రాశాడు. ఇందులో ఏదో యాక్షన్ సన్నివేశం పెట్టాలి కదా అన్నట్టుగా ఎక్కడా పెట్టలేదు. దాని చుట్టూ బలమైన ఎమోషన్ ఉండేలా చూసుకున్నాడు. ఈ కథలో చాలా లేయర్స్ ఉన్నాయి. అన్నదమ్ముల అనుబంధం నేపథ్యంలో ప్రధానంగా కథ ఉంటుంది. కానీ, ఇందులో దేశభక్తికి సంబంధించిన అంశముంది. అలాగే, ఒక తెగకు చెందిన నాయకుడి గురించి ఉంటుంది. ఇలా ఇన్ని అంశాలను ఒకే భాగంలో చెప్పడం సాధ్యంకాదు. అందుకే రెండు భాగాలుగా చెప్పాలని నిర్ణయించు కున్నాము. తన అన్నయ్య శివ కోసం సూరి చేసిన ప్రయాణాన్ని మొదటి భాగంలో చూశాం. రెండవ భాగానికి సంబంధించి గౌతమ్ దగ్గర గొప్ప గొప్ప ఆలోచనలు ఉన్నాయి. మొదటి భాగంతో పోలిస్తే రెండవ భాగంగా ఇంకా అద్భుతంగా ఉండబోతుందని వివరించాడు.




## దూసుకుపోతున్న సైయారా మూవీ

- సైలెంట్‌గా కలెక్షన్లు రాబడుతున్నట్లు వెల్లడి

అహాన్ పాండే, అనీత్ పడ్డా జంటగా నటించిన యూత్‌ఫుల్ ఎంటర్-టైనర్ 'సైయారా' మూవీ ప్రేక్షకులను ఉర్రూతలూగిస్తోంది. ఈ ప్రేమకథా చిత్రం ప్రస్తుతం మూడో వారంలోకి అడుగు పెట్టింది. శుక్రవారం 'సన్ ఆఫ్ సర్దార్ 2' , 'ధడక్ 2' విడుదలైనప్పటికీ 'సై-యారా'కు ప్రేక్షకుల్లో ఆదరణ తగ్గలేదు. ఈ చిత్రం 15 రోజుల్లో దాదాపు రూ.284 కోట్లను రాబట్టింది. ఈ వారాంతానికి రూ.300 కోట్లు- వసూలు చేస్తుందని మార్కెట్ వర్గాలు అంచనాలు వేస్తున్నాయి. 'సైయారా' రెండో వారంలో 107.75 కోట్లను రాబట్టింది. బాలీవుడ్‌లో రెండో వారంలో అత్యధిక వసూళ్లు సాధించిన పదో చిత్రంగా నిలిచి రికార్డు సృష్టించింది. 'ది కశ్మీర్ ఫైల్స్' (రూ.108.97 కోట్లు-), 'దంగల్' (రూ.115.96 కోట్లు-), జవాన్ (రూ.125.46 కోట్లు-) చిత్రాలు 'సైయారా' కంటే ముందున్నాయి. మొదటివారంతో పోల్చుకుంటే.. రెండో వారంలో కలెక్షన్లు కాస్త తగ్గినప్పటికీ.. మూడోవారమూ విజయవంతంగా ప్రదర్శితమయ్యే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. అజయ్‌దేవ్‌గణ్ నటించిన 'సన్ ఆఫ్ సర్దార్ 2', సిద్ధాంత్ చతుర్వేది ప్రధాన పాత్ర పోషించిన 'ధడక్ 2'కు ప్రేక్షకుల నుంచి మిశ్రమ స్పందనే దక్కుతోంది. ఇది జులై 18న విడుదలైన 'సైయారా'కు కలిసివస్తోంది.



## అవార్డు గ్రహీతలకు చిరంజివి శుభాకాంక్షలు

71వ జాతీయ చలనచిత్ర అవార్డుల్లో ఏడు కేటగిరీల్లో తెలుగు సినిమాకు అవార్డులు వరించాయి. బాలకృష్ణ కథానాయకుడిగా, అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన 'భగవంత్ కేసరి' చిత్రం 'ఉత్తమ ప్రాంతీయ తెలుగు చలనచిత్రం' అవార్డును గెలుచుకుంది. అలాగే ప్రశాంత్‌వర్మ దర్శకత్వంలో రూపొందిన మైథలాజికల్ సోషియో ఫాంటసీ 'హను-మాన్'.. ఉత్తమ యానిమేషన్ విజువల్ ఎఫెక్ట్స్ విభాగం లో ఉత్తమ చిత్రంగా ఎంపికైంది. 'బేబీ'కి బెస్ట్ స్క్రీన్‌ప్లే, బెస్ట్ సింగింగ్ అవార్డులు దక్కాయి. ఉత్తమ బాలనటి కేటగిరిలో 'గాంధీతాత చెట్టు-' సినిమా నుంచి సుకృతివేణి అవార్డుకు ఎంపికైంది. తెలుగు చిత్రాలు సత్తా చాటిన నేపథ్యంలో పలువురు ప్రముఖులు శు భాకాంక్షలు తెలియజేస్తున్నారు. ఈ క్రమంలో మెగాస్టార్ చిరంజీవి తన సోషల్ మీడియాలో జాతీయ అవార్డ్ గ్రహీతలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతూ పోస్ట్ చేశారు. 'తెలుగు టాలెంట్, తెలుగు సినిమాలు ఈసారి పదికి పైగా విభాగాల్లో అవార్డులు గెలుచుకోవడం చూసి ఎంతో గర్వంగా ఉంది.. ' అంటూ పోస్ట్ లో పేర్కొన్నారు. అలానే బాలయ్య నటించిన భగవంత్ కేసరి చిత్ర బృందానికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. అలానే తన పోస్ట్‌లో అవార్డులు గెలుచుకున్న వారికి సంబంధించిన లిస్ట్ కూడా పెట్టారు. తెలుగు సినిమా విజేతలకు ప్రత్యేక అభినందనలు. భారతీయ సినిమాకి ఈ అవార్డులు మరింత ప్రోత్సాహాన్ని ఇస్తాయని చిరు అన్నారు.

## చెప్పు తెగుద్ది.. అనసూయ స్ట్రాంగ్ వార్నింగ్

టాలీవుడ్ నటి, యాంకర్ అనసూయ కొందరు యువకులకు అసభ్య కామెంట్లు చేస్తే చెప్పు తెగుద్ది అంటూ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చింది. ఆంధ్రప్రదేశ్ ప్రకాశం జిల్లా మార్కపూరంలోని ఓ షాపింగ్‌మాల్ ఓపెనింగ్‌లో భాగంగా అక్కడికి వెళ్లిన అనసూయని కొందరు ఆకతాయిలు కామెంట్లు- చేయడం మొదలుపెట్టారు. దీంతో అనసూయ వారికి గట్టిగా వార్నింగ్ ఇచ్చింది. చెప్పు తెగుద్ది.. మీ ఇంట్లో అమ్మ, చెల్లి, భార్య కుటుంబసభ్యులను ఇలాగే కామెంట్లు- చేస్తే ఊరుకుంటారా. పెద్దవాళ్లకి మర్యాద ఇవ్వడం మీ ఇంట్లో నేర్పలేదా అంటూ అనసూయ ఆగ్రహం వ్యక్తం చేసింది. కాగా ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది.



Printed, Published and Owned by Ganji. Venkatesh, Printed At Nandini Printers H.NO . 3-29, Mankhal Village, Tukkuguda Muncipalty, Maheswaram Mandal, Ranga Reddy District - Pin Code 501359 And Published From H.NO. 3-29, Mankhal Village, Tukkuguda Muncipalty, Maheswaram Mandal, Ranga Reddy District - Pin Code 501359 Telangana State. Editor Ganji Venkatesh
RNI NO: TELTEL /2022/85167, Phone NO 9705347284, Email ID:Padmakranthi2022@gmail.com.